Volume IV - Issue II
February 2021

# విద్యార్థి వెలుగు



ప్రేమ, సంతోషం, సమాధానం, దీర్ఘశాంతం...

## ఆత్మ ఫలం

కవర్ స్టోరీ – 4 లో

# అంకితం

## సంపాదకీయం

అరవై ఐదు సం॥రాల క్రితం, ఐదుగురు మిషనరీలు ప్రపంచంలోనే కిరాతక ఆటవిక తెగకు సువార్తను తీసుకెళ్లడానికి తీర్మానించుకున్నారు. వారిని సమీపించిన వారెవరూ ప్రాణాలతో తిరిగి రాలేదు. ఆ విషయం తెలిసి కూడ సాహొసపేతమైన కార్యానికి ఒడిగట్టారు. ఒక లౌడ్ స్పీకర్, బహుమతులను జారవిడచటానికి ఒక బుట్టను ఉపయోగిస్తూ, విమానంలో నుంచే వారితో పరిచయం ఏర్పరచుకున్నారు. కొద్ది నెలలు ఆ విధంగా చేసిన తరువాత ఆ తెగ నివసించే గ్రామానికి సమీపాన ఉన్న నదీ తీరంలో దిగి స్థావరం ఏర్పరచుకున్నారు. వారితో సంబంధం ఏర్పరచుకున్నామన్న సంతోషం, కొద్ది రోజులలోనే మిషనరీలు ఆ ఆటవికుల దాడిలో చనిపోవడంతో సమాధి అయింది. ఆ సంఘటన అంతటితో ముగిసుంటే కాలగర్భంలో కలిసిపోయేది.




సరిగ్గా ఇది జరిగిన రెండు సం॥రాలకు ఆటవిక దాడిలో చనిపోయిన వారిలో ఒకరైన జిమ్ ఇలియట్ భార్య ఎలిసెబెత్ మరియు పైలట్ నాటే సెయింట్ సోదరి, చావుకు భయపడక తమ వారిని చంపినవారికి సువార్త చెప్పడానికి వెళ్ళారు. వారు ఆ హువారానీ అటవిక తెగవారితో శాంతియుతంగా సంబంధం ఏర్పరచుకొన్న తరువాత వారి భాష నేర్చుకొని దేవుని వాక్యాన్ని వివరించారు. ఒకప్పుడు ఎంతో క్రూరంగా, ఆటవికంగా జీవించిన ప్రజలు సజీవుడైన దేవునితో సంబంధం ఏర్పరచుకొని దానిలో కొనసాగేందుకు ఆ ఇద్దరి స్త్రీల రాక దోహదపడింది. దేవుని కృప, మిషనరీలు చిందించిన రక్తం, వారు సువార్తను అంగీకరించుటకు కారణమయ్యింది.

క్రీస్తు నొద్దకు వచ్చిన వారిలో ఐదుగురు మిషనరీలలో ఒకరైన పైలట్ నాటే సెయింట్‌ను చంపిన వ్యక్తి మిన్కే. అతని తెగలో చోటు చేసుకున్న గొప్ప మార్పును గురించి అతను ఇలా అన్నాడు "వారు దేవుని వాక్యాన్ని మా యొద్దకు తీసుకొచ్చే వరకు చెడుగా వ్యవహరించాం. దేవుని వాక్యాన్ని తెలుసుకొని, ఆయన మంచిని అనుసరించి, ఇప్పుడు మేము అందరితో కలసి సంతోషంగా మరియు శాంతి సమాధానలతో జీవిస్తున్నాం".

విమోచన పొందిన ప్రజల జీవితాలలో దేవుని దయ, క్షమాపణ పరిశుద్ధాత్ముని కార్యానికి చక్కటి ఉదాహరణ మిన్కే. తరువాత కాలంలో హతసాక్షి గావించబడిన నాటే సెయింట్ కుమారుడైన స్టీవ్ సెయింట్ మరియు మిన్కే మధ్య బంధుత్వ బంధం ఏర్పడేంత స్నేహాన్ని కలిగియున్నారు. మిన్కే, స్టీవ్‌ను 'గిరిజిన కొడుకు' గా స్వీకరించాడు. స్టీవ్ పెద్దవాడయ్యాక తన కుటుంబాన్ని హువారానీ తెగతో శాశ్వతంగా జీవించడానికి తీసుకు వచ్చినప్పుడు మిన్కే స్టీవ్ పిల్లలను తన మనవళ్ళుగా భావించాడు.

యు.ఎస్., కెనడా, ఆమ్‌స్టర్‌డామ్, హైదరాబాద్ మరియు పనామాకు, ఇలా ఎక్కడికి వెళ్ళినా అమెజాన్ యోధుడైన మిన్కే మరియు స్టీవ్ కలిసి వెళ్ళారు. స్టీవ్, మిన్కే గురించి ఈవిధంగా చెప్పడం అతిశయోక్తి కాదేమో, "అవును! అతడు నా తండ్రిని చంపాడు, కాని అతను నన్ను, నా కుటుంబాన్ని ప్రేమించాడు... అతడు ప్రపంచంలోని నా ప్రియమైన స్నేహితులలో ఒకడు". ఏప్రిల్ 28, జనవరి 2020న మిన్కే ఇహలోకాన్ని విడిచి పరదైసులో ఉన్న మిషనరీల వద్దకు చేరాడు. స్టీవ్ నిజంగా ఒక గొప్ప స్నేహితుడిని కోల్పోయాడు.

నిజమే! మన పాపాలను ఒప్పుకొని, యేసు క్రీస్తు సిలువపై చేసిన కార్యమందు విశ్వాసముంచినప్పుడు దేవుని క్షమాపణతో పాటు పరిశుద్ధాత్మని పొందుతాం. పరిశుద్ధాత్మ దేవుడు మన జీవితంలోకి వచ్చినప్పుడు ఆత్మానుసారంగా జీవించడానికి సహాయం చేస్తాడు. ఎప్పుడైతే ఆత్మానుసారంగా నడచుకోవడానికి యిష్టపడతామో, ఆత్మ ఫలంలో ఉన్న తొమ్మిది లక్షణాలు అనగా "ప్రేమ, సంతోషం, సమాధానం, ధీర్ఘశాంతం, దయాళుత్వం, మంచితనం, విశ్వాసం, సాత్వికం, ఆశానిగ్రహం" మన జీవితాల్లో కనిపిస్తాయి. హువారానీ తెగలో గాని, మిన్కేలో గాని ఈ లక్షణాలు కనిపించాయంటే, ఆత్మానుసారంగా నడుచుకోవడం వల్లే సాధ్యమైంది. ఫలితంగా, వారు "క్రీస్తు యేసు సంబంధులుగా శరీరమును దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువవేసి యున్నారు" (గలతీ 5:24). అంతే కాకుండా స్టీవ్‌ను, అతని కుటుంబాన్ని ప్రేమించారు. వారిలో ఒకరిగా కలుపుకున్నారు.

ఆత్మ ఫలాన్ని గురించి వ్రాసిన పౌలు కూడా తన పూర్వ జీవితాన్ని గురించి "పూర్వం దూషకుడను, హానికరుడను, హింసకుడను" అని వ్రాసాడు (1 తిమో1:13). ఎప్పుడైతే పరిశుద్ధాత్ముని కార్యం తన జీవితంలో కార్యరూపం దాల్చిందో శరీరానుసారంగా ప్రవర్తింపక, ఆత్మానుసారంగా జీవించడం మొదలు పెట్టాడు.

కాబట్టి దేవుని ఆత్మ మూలంగా జన్మించిన ప్రతి ఒక్కరం ఆత్మానుసారంగా జీవించాలి. మిన్కే, పౌలుల మాదిరిగా మనలోని శరీరేచ్ఛలను సిలువ వేయాలి. అలా చేసినప్పుడు ఆత్మ ఫలంలోని లక్షణాలు మనలో స్పష్టంగా కనిపిస్తాయి, ఆత్మానుసారంగా జీవిస్తే దేవునితోను, మనుష్యులందరితోను సంతోషంగా, సమాధానంగా జీవించగలం.

మరి ఆత్మానుసారంగా జీవించాలా లేక శరీరానుసారంగా జీవించాలా అనేది మన చేతిలోనే ఉంది. "ప్రేమ, సంతోషం, సమాధానం, ధీర్ఘశాంతం, దయాళుత్వం, మంచితనం, విశ్వాసం, సాత్వికం, ఆశానిగ్రహం" అనే ఆత్మ ఫలానికి నేను నా రోజును అంకితం చేస్తున్నానని మాక్స్ లాకాడో అనే భక్తుడు అన్నాడు. మరి మన రోజును దేనికి అంకితం చేద్దాం? ఆత్మానుసారంగా జీవించడానికా? లేక శరీరానుసారంగా జీవించడానికా?

– కె. జాన్ భూషణం

మేనేజింగ్ ఎడిటర్

**FEBRUARY 2021**
**VIDYARTHI VELUGU**
A publication of the UESI-TS Publication Trust

# విషయ సూచిక


| | |
|---|---|
| ఆత్మ ఫలం | 4 |
| జీన్ పాంక్విస్ట్ | 18 |
| ఇ.యు స్టూడెంట్ ఇన్ పాండమిక్ | 20 |
| సాక్ష్యం | 22 |
| యరొబాము | 24 |
| కథానిక | 26 |
| స్టడీ సెంటర్ | 28 |
| పరిణితి చెందిన వ్యక్తిలో ఉండాల్సిన లక్షణాలు | 29 |


## EDITORIAL BOARD

Editor and Publisher:
Mr. Sudhir Kumar Gaddam, Hyderabad.
Managing Editor:
Mr.K.John Bhushanam, Hyderabad.
Litt. Dept. Secretary: Mr.Nani Babu, Hyderabad.
**Members:**
Dr. Mercy Sujatha, Hyderabad.
Mrs. Ruth Vinay, Rangareddy.
Mr. Michael Fernandez, Hyderabad.
Mr. Simon, Hyderabad.
Mr. Enoch.Y., Khammam.

## UESI-TS Account Details

Name - UESI-TS
Bank - State Bank of India
A/C No - **35233350086**
Branch - Barkatpura, Hyderabad
IFSC code - SBIN0007641
Kindly inform the office after depositing amount to Ph. 7386598974

## VV & LITERATURE Account Details

Name - UESI PUBLICATION TRUST
Bank - Canara Bank
A/C No - **0624101037187**
Branch - East Maredpally, Secunderabad
IFSC code - CNRB0000624
Kindly inform the office after depositing amount to Ph. 9491595765


**Note:** This account is only for VV & Literature purchases

Themes for
**Mar'21 : Missions**
**Apr'21 : Finding the Right Fit**

**Note: Please send your write-ups on or before 15th of every month to editorvv2018@gmail.com**

## పాఠకుల స్పందన....

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన....** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు





ముఖచిత్ర కథనం

# ఆత్మఫలం

### ఆత్మఫలం అంటే...

విశ్వాసులు పరిశుద్ధాత్మ దేవుని చేత నడిపించబడుతున్నప్పుడు వారి ప్రవర్తనలో కనిపించేదే ఆత్మఫలం. విశ్వాసులు దేవునిలో ఫలిస్తున్నారు అనడానికి రుజువు వారి ఆత్మఫలం. “ఎవడు నాయందు నిలచియుండునో నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు” (యోహా 15:5) అని యేసు చెప్పాడు. విశ్వాసులు ఆత్మలో ఫలించాలని దేవుని కోరిక. “మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమపరచ బడును; ఇందువలన మీరు నా శిష్యులగుదురు” (యోహా 15:8) అని ప్రభువు చెప్పాడు.

విశ్వాసులు ఆత్మఫలంలోని తొమ్మిది గుణాలను జీవనశైలిగా చేసుకోవాలి. ఈ తొమ్మిది గుణాలు మన జీవనశైలి ద్వారా దేవుని యెదుట, ప్రజల యెదుట స్పష్టంగా కనపరచాలి. అలాగే ఆత్మఫలం పరలోకంలో మన ఆత్మీయ సౌశీల్యాన్ని వెల్లడిచేసే ఫలితాలు. ఇవి లోకంలో మనద్వారా తోటివారికి పదివేలలో ‘అతి సందరుడైన రక్షకుడిని’ చూపించే పరిపూర్ణ ఆత్మీయ ఫలాలు.

### ఆత్మఫలం పరిశుద్ధాత్మ కార్యం

పాపంలో జీవిస్తున్నవారు నిజమైన పశ్చాత్తాపం పొంది క్రీస్తునందు విశ్వాసం ద్వారా కొత్త జీవితాన్ని ప్రారంభించినప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు ఆ వ్యక్తిలో నివాసం చేస్తాడు. నాటినుండి విశ్వాసులు దేవుని సంకల్పానుసారంగా జీవించడానికి ఆయన సహాయం చేస్తాడు. ఆయనకు విధేయత చూపిస్తూ నడుచుకొనే క్రమంలో క్రీస్తు బిడ్డలు ఆత్మానుసారమైన ‘ఆత్మఫలం’ ఫలిస్తారు. “ఆత్మ ఫలమేదనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము...క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువవేసి యున్నారు” (గలతి 5:22-24) అని వాక్యం చెబుతుంది.

### ఆత్మఫలం ఎలా వస్తుంది?

రైతు ఫలం పొందాలంటే, ముందు విత్తనం నాటాలి. అది మొలచి పెద్దదై చెట్టుగా ఎదిగి మొగ్గలు, పువ్వులు, కాయలు కాస్తాయి. ఆత్మఫలం కూడా అంతే. మన హృదయంలో మనం చేసుకొనే ఆత్మీయ సాగుబడి ద్వారా వస్తుంది. దేవుని ఆత్మ మనలో ఉన్నప్పుడు, ఆత్మానుసారంగా జీవిస్తున్నప్పుడు ప్రభువు మనకు ఈ ఆత్మఫలాన్ని అనుగ్రహిస్తాడు. ఈ ఫలం మన కష్టార్జితం కాదు. ఆత్మఫలం పొందాలంటే ఆత్మానుసారంగా నడుచుకోవాలి. “నేను చెప్పునదేమనగా ఆత్మాను సారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. శరీరము ఆత్మకును ఆత్మ శరీరమునకును విరోధముగా ఆపేక్షించును” (గలతి 5:16,17) అని బైబిల్ చెబుతుంది.

ఆత్మానుసారంగా జీవించని వారిలో ఈ ఫలం

కనబడదు. మనం ప్రభువును విశ్వసించినట్లయితే మనలో ఆయన ప్రేమ, సంతోషం, సమాధానం పుట్టుకొస్తాయి. వీటిని భద్రపరచుకొంటే దీర్ఘశాంతం, దయాళుత్వం, మంచితనం, విశ్వాసం, సాత్వికం, ఆశానిగ్రహం కలుగుతాయి. ఆత్మఫలం దేవుని కృపావరం. అయితే దానిని అందుకునేందుకు ఆసక్తి చూపని వారికి స్తబ్దంగా ఉండేవారికి అది అందదు.

# ప్రేమ



– ఇ.జె.మోజెస్

## ప్రేమకు మూలం దేవుడే

ప్రేమ దేవుని నుండి వస్తుంది. మానవ ప్రేమలన్నీ దేవుని నుండే ప్రవహిస్తాయి. ఎందుకంటే ప్రేమకు మూలం దేవుడే. ఆయన స్వభావమే ప్రేమ. దేవుడు ప్రేమాస్వరూపి. ప్రేమలో జీవించనివారు ప్రేమకు మూలమైన దేవునితో సంబంధం లేనివారు. అలాంటి వారు దేవుని బిడ్డలు కారు (1 యోహా4:1–8). ఆ ప్రేమా స్వరూపియైన దేవుడు మనల్ని ప్రేమిస్తున్నాడనుటకు ఋజువు తన కుమారున్ని మనకోసం ఇచ్చాడు. కుమారుడు తననుతాను ఇష్టపూర్వకంగా సమర్పించు కొన్నాడు. వారి ప్రేమను అనుకరిస్తూ మనం కూడా ఒకరినొకరం ప్రేమించుకోవాలి (1 యోహా 4:9–11).

## ప్రేమించాలనేది దేవుని ఆజ్ఞ

ధర్మశాస్త్రంలో ముఖ్యమైన ఆజ్ఞ ఏదని ఒక ధర్మశాస్త్రోపదేశకుడు అడిగిన ప్రశ్నకు "నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సు తోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే" (మత్త22:35–40) అని యేసు చెప్పాడు.

ఈ ప్రేమ గురించి యేసు శిష్యులతో మాట్లాడుతూ "మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను. మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురనెను" (యోహా 13:34,35) అని చెప్పాడు. మరొకసారి "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీరొకని నొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ" (యోహా 15:12) అని చెప్పాడు. "మీరు ఒకనినొకడు ప్రేమింపవలెనని యీ సంగతులను మీకు ఆజ్ఞాపించుచున్నాను'' (యోహా 15:17) అని నొక్కిచెప్పాడు.

## ప్రేమను క్రియలలో చూపాలి

ఆత్మఫలములో పౌలు ప్రేమకు మొదటి స్థానం ఇచ్చి యేసు బోధను ప్రతిధ్వనింప చేస్తున్నాడు. ఆత్మఫలంలోని ప్రేమ "నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింప వలెను" అనే ఆజ్ఞకు చెందినది. ఏదో అంతా బాగుంది అనే భావోద్వేగపూరిత ప్రేమ గురించి పౌలు మాట్లాడటం లేదు. నిజమైన ఆచరణాత్మక ప్రేమతో జీవించాలని తెలియజేస్తున్నాడు. అంటే తోటివారి అవసరాలలో సహాయపడడం, ఆపదలలో సంరక్షించడం, నిరాశలో ప్రోత్సహించడం గురించి మాట్లాడు తున్నాడు. క్రియలలో కనిపించే ప్రేమ గురించి మాట్లాడుతున్నాడు.

యోహాను కూడా ఈ ఆజ్ఞను జ్ఞాపకం చేస్తూ కేవలం మాటలతో, నాలుకతో కాక క్రియలలో ఒకరినొకరము ప్రేమించుకోవాలని చెప్పాడు. "మనమొకని నొకడు ప్రేమింపవలెననునది మొదట నుండి మీరు వినిన వర్తమానమే గదా... ఈ లోకపు జీవనోపాధి గలవాడై యుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు, అతని యెడల ఎంతమాత్రమును కనికరము చూపని వానియందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును? చిన్న పిల్లలారా, మాటతోను నాలుకతోను కాక క్రియతోను సత్యముతోను ప్రేమింతము'' (1 యోహా 3:11,17,18) అని యోహాను నొక్కి చెప్పాడు.

## క్రైస్తవునికి ముఖ్యమైనది ప్రేమే

"ఆయన ఆజ్ఞ యేదనగా ఆయన కుమారుడైన యేసుక్రీస్తు నామమును నమ్ముకొని, ఆయన మనకు ఆజ్ఞనిచ్చిన ప్రకారముగా ఒకనినొకడు ప్రేమింప వలెననునదియే" (1 యోహా 3:23). కాబట్టి ఒక క్రైస్తవుడిగా ఉండటానికి, యేసు లాగా మారడానికి ప్రాథమికమైనది, ప్రాముఖ్యమైనది ప్రేమే. క్రీస్తును వెంబడించేవారు ఒకరినొకరు ప్రేమించుకోవడం వలన అనేక సత్యాలకు నిదర్శనాలు స్పష్టంగా కనబడు తుంటాయి.

**1. ప్రేమించడం జీవిస్తున్నామనడానికి నిదర్శనం**

ఒక వృక్షం జీవిస్తుంది అని దానికి ఉన్న ఆకులు, మొగ్గలు, ఫలాలను బట్టి చెప్పగలం. అలాగే ఒక విశ్వాసి జీవిస్తున్నాడని వానిలో ఉన్న ప్రేమను బట్టి చెప్పగలం. ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడే జీవం ఉంటుంది. ఎవరిలో ప్రేమ ఉందో వారే జీవిస్తున్నట్టు. విశ్వాసులు ప్రేమను ఆచరణలో పెట్టినప్పుడు, వారి మధ్య, వారిలో దేవుడు ఉన్నట్టు అందరు స్పష్టంగా గమనిస్తారు."మనము సహోదరులను ప్రేమించు చున్నాము గనుక మరణములో నుండి జీవములోనికి దాటియున్నామని యెరుగుదుము. ప్రేమలేనివాడు మరణమందు నిలిచి యున్నాడు" (1 యోహా 3:14) అని వాక్యం చెబుతుంది.

మనం ప్రేమను ఆచరణలో పెట్టకపోతే, మనలోని పోరాటాలు, విభేదాలు ఇతరులు చూస్తే మనం మరణంలో నిలిచి ఉన్నట్టే. యేసును అంగీకరించి జీవములోకి వచ్చిన మనం విభేదాలను విడిచి ఒకరినొకరం ప్రేమిస్తూ అనేకులను జీవంలోకి దాటిద్దాం. ప్రొ. ఇనాక్ దంపతులు "తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండే ప్రేమ కంటే ఎక్కువైన ప్రేమతో నన్ను ప్రేమించారని" సత్యీర్తిరావు "ఆయన అడుగు జాడల్లో" పుస్తకపు ముందుమాటలో రాశారు.

**2. ప్రేమించడం విశ్వాసానికి నిదర్శనం**

"విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును" (యాకో 2:17) అని యాకోబు విశ్వాసం, క్రియలకు మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేశాడు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న తోటివారి యెడల, అవసరాలలో ఉన్న విద్యార్థుల పట్ల మన ప్రేమను ఎలా కనపరుస్తున్నామో ఆలోచించుకొని మన విశ్వాసాన్ని బేరీజు వేసుకుందాం. ప్రొ. ఇనాక్ దేవుని వాక్యానికి లోబడి తన జీతంలో కొంత డబ్బును పూర్తికాల సేవకులకు, కొంత బిక్షగాళ్లకు, కొంత విధవరాళ్ళకు, కొంత మిగతావారికి ఇచ్చి విశ్వాసంతో తన ప్రేమను ప్రదర్శించాడు.

**3. ప్రేమించడం దేవున్ని చూపిస్తుంది**

"ఏ మానవుడును దేవుని ఎప్పుడును చూచియుండ లేదు; మన మొకనినొకడు ప్రేమించిన యెడల దేవుడు మనయందు నిలిచియుండును; ఆయన ప్రేమ మన యందు సంపూర్ణమగును" (1 యోహా 4:12) అని వాక్యం చెబుతుంది. మనం ఒకరినొకరం ప్రేమించు కోవడం ద్వారా దేవుని ప్రేమను ప్రతిబింబిస్తాం. ఇంకో విధంగా ఆలోచిస్తే "ప్రేమే దేవుడు కనుక ప్రేమ ద్వారా దేవున్ని ఇతరులకు చూపించగలం". క్రీస్తును వెంబడించేవారంగా మనం ప్రేమను ప్రదర్శించ గలిగితే లోకం కనిపించని దేవున్ని మన ద్వారా చూడగలుగుతుంది.

1994లో రువాండాలోని టుట్సీ మరియు హుటుస్ అనే జాతుల మధ్య జరిగిన మారణహోమంలో సుమారు 8 లక్షల ప్రజలు చనిపోయారు. ఇరువైపుల పెద్దలు ఈ రెండు జాతులవారిని దూరంగా ఉండాలని హెచ్చరించారు. అయితే ఈ రెండు జాతులకు చెందిన కొందరు ఐఎఫ్ఇయస్ విద్యార్థులు ఒకరిచేతులు ఒకరు పట్టుకొని ప్రార్థించడం ప్రారంభించారు. "మేము క్రీస్తులో ఏకమై జీవిస్తాం, అవసరమైతే చనిపోతాం" అని క్రీస్తు ప్రేమను ప్రదర్శించారు. వారిలోని అదృశ్య దేవున్ని ఆ జాతులలోని ఇతరులు చూడగలిగారు.

**మనలో ప్రేమ లేకపోతే...**

క్రీస్తును వెంబడించే వారు ఒకరినొకరు ప్రేమించుకోక పోవడం విషాదమే కాదు విషపూరితం కూడా. మనం ఆయన శిష్యులంగా ఉండి, ఒకరి నొకరం ప్రేమించుకుంటూ సువార్త ప్రకారం జీవించాలి, దేవుని ప్రేమను ఇతరులకు చూపించాలి. మన జీవితాలను, సంబంధాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకుంటూ ప్రేమయైయున్న దేవున్ని మన జీవితాల ద్వారా ప్రదర్శిద్దాం. దేవుడు అట్టి గొప్ప పట్టుదలను కృపను మన అందరిలో కలిగించును గాక!

నాది, నాకు, మా ఇంటికి, ఇంకా సంపాదించుకోవాలి అనే స్వార్థపూరిత జీవితం నుండి అవసరాలలో, ఆపదలో ఉన్న తోటివారిని చూచే కన్నులు, ఇచ్చే హృదయం కలిగి మన దేవుని గుణలక్షణాలతో బ్రతుకుదాం. ఇతర విశ్వాసులను ప్రేమించడం మనకు కష్టమైతే ప్రేమకు ఆధారమైన దేవుని యొద్దకు వెళ్ళి హృదయం పగిలేలా ఏడుస్తూ ఆయన దైవిక ప్రేమతో మనల్ని నింపమని ప్రార్థిద్దాం. ప్రేమకు మాదిరైన సిలువను చూద్దాం. ఆయన మాదిరిని అనుసరిద్దాం •

**ఇ.జె.మోజెస్,** లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్చర్ల మరియు మహబూబ్‌నగర్‌లో గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

# సంతోషం



– డి.అనీల్ కుమార్

## సంతోషం అందరికీ కావాలి

విశ్వాసి, అవిశ్వాసి అనే భేదం లేకుండ ఈ లోకంలో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని కోరుకొంటారు. సంతోషాన్ని వద్దనేవారు, కాదనేవారు ఎవరూ ఉండరు. సంతోషంలోని మాధుర్యాన్ని హృదయమున్న ప్రతి ఒక్కరు ఆస్వాదిస్తారు. సంతోషం దేవుని పరలోక ఆశీర్వాదం. ఈ భూమి మీద అందరి కోరికల అంతిమ లక్ష్యం 'సంతోషమే'. దీనికోసం మానవాళి ఈ ధరణిలో తిరుగని చోటు లేదు, పడని కష్టం లేదు. సంతోషం కోసం వెతకని వారులేరు, ఆరాటపడని హృదయం లేదు. ఎందుకంటే 'హృదయవాంఛ' అంతిమ గురి సంతోషమే కదా! అయితే ఈ సంతోషం క్రీస్తులోనా లేక క్రీస్తు బయటనా అనేది ప్రాముఖ్యం.

18వ శతాబ్దపు 'ప్రిన్స్ ఆఫ్ ప్రీచర్స్' ఛార్లెస్ స్పర్జన్ విశ్వాసుల 'సంతోషం' మూలాలను అభివర్ణిస్తూ "విశ్వాసులు పరిస్థితులపై ఆధారపడరు. వారి ఆనందం వారికి కలిగిన దానినుండి రాదు, వారు ఏమైయున్నారో అనేదానిని బట్టి వస్తుంది. ఎక్కడ ఉన్నారో అనేదానిని బట్టి కాదు, ఎవరి నుండి వచ్చారో దానిని బట్టి వస్తుంది. వారు ఆనందించే వాటినుండి కాదు, వారి కోసం శ్రమను అనుభవించిన ప్రభువునుండి వస్తుంది" అని చెప్పాడు.

## సంతోషాన్ని రుచి చూసావా?

ఇంతటి ప్రాముఖ్యమైన సంతోషాన్ని మనం ఎందుకు కలిగి ఉండలేకపోతున్నాం? దానికి కారణం ఆ ఫలం విలువ తెలియనివారమైనా అయివుండాలి లేక 'సంతోష ఆత్మ ఫలాన్ని' అనుభవంలో రుచిచూడని వారమైనా అయివుండాలి. ఈ భూమి మీద దేనినైనా చూడడం, వినడం, తాకడం ద్వారా ఒక నిర్ణయానికి రావచ్చు. కాని 'ఫలాన్ని' మాత్రం తిని రుచి చూడకపోతే, దానిని ఆస్వాదించకపోతే ఒక నిర్ణయానికి రాలేం. మనం ఆత్మీయంగా ఫలించాలని ప్రభువైన కీస్తు తనను తాను పరిమళ సువాసనగా సిలువలో అర్పించుకొని మన 'సంతోషం' పరిపూర్ణం కావలెనని ఆయన చేసిన కల్వరి కార్యాన్ని మరచిపోయామా? లేక ఆ తొలి ప్రేమను, ఆ మొదటి ఆత్మీయ సమాధానమనే సంతోషాన్ని మనమే అనుభవిస్తూ ఇతరులకు అందించలేక పోతున్నామా?

## మీ సంతోషం పరిపూర్ణం కావాలి

యేసు "నేను నిజమైన ద్రాక్షవల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలింపని ప్రతి తీగను ఆయన తీసి పారవేయును, ఫలించు ప్రతి తీగ మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసి వేయును" (యోహా 15:1,2) అని చెప్పాడు. ఈ సంగతులు చెప్పిన ఉద్దేశం "మీయందు నా సంతోషము ఉండవలెననియు, మీ సంతోషము పరిపూర్ణము కావలెనని ఈ సంగతులు మీతో చెప్పుచున్నాను" (యోహా 15:11) అని చెప్పాడు. ఈ ఆత్మీయ సంతోషం అనే ఫలం మనకు చెందాలనేది ఆయన కోరిక. ఆయన పరిశుద్ధాత్మ ద్వారా ఇచ్చే సంతోషం పరిపూర్ణం కావలెనని మన పట్ల ఆయన ఆశ, చిత్తమై ఉన్నాయి.

అలాగే "స్త్రీ ప్రసవించునప్పుడు ఆమె గడియ వచ్చెను గనుక ఆమె వేదనపడును; అయితే శిశువు పుట్టగానే లోకమందు నరుడొకడు పుట్టెనను సంతోషం చేత ఆమె ఆ వేదన మరి జ్ఞాపకం చేసుకొనదు. అటువలె మీరును ఇప్పుడు దు:ఖపడుచున్నారు గాని మిమ్మును మరల చూచెదను, అప్పుడు మీ హృదయం సంతోషించును, మీ సంతోషమును ఎవడును మీ యొద్దనుండి తీసివేయడు" (యోహా 16:21,22) అని యేసు చెప్పాడు. కాబట్టి ఆయన మన ఆత్మీయ 'సంతోష ఫలం' పై ఆసక్తి కలిగివున్నాడు. ఆయన మన సంతోషానికి అధిపతి, ఆశ్రయకర్తగా ఉన్నాడు. కాబట్టి ఈ 'సంతోషం' అనే ఆత్మఫలాన్ని క్రీస్తునాథునిలో పరిపూర్ణం చేసుకొందాం.

## సంతోషాన్ని తోటివారికి పంచాలి

అనుదినం ఆయన వాక్యాన్ని అనుసరిస్తూ, ఆయన కట్టడలను నెరవేరుస్తూ వ్యక్తిగతంగా, ఆత్మీయంగా ఫలిద్దాం. "దేవుని రాజ్యం భోజనమును, పానమును కాదుగాని నీతియు, సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది" (రోమ 14:17) అని వాక్యం చెబుతుంది. కాబట్టి ప్రతిరోజు ప్రభువా! ప్రభువా! అని పిలుస్తూ కూడా సంతోషం లేకుండా జీవిస్తున్నావా? ఆయన నీపైన పెట్టుకున్న

నమ్మకాన్ని వమ్ముచేస్తావా? లేక నమ్మకంగా స్థిరంగా పరిశుద్ధాత్ముని 'సంతోషఫలాన్ని' రుచిచూస్తూ క్రీస్తు మనస్సుతో, సంపూర్ణ ప్రేమతో తోటివారికి, మరీ ముఖ్యంగా ఈతరం వారికి ఆ సంతోషాన్ని అందిస్తావా?

మన సొంత రాజ్యం నిర్మించుకొని, సొంత ఎజెండాలతో కొంతకాలం ఆనందంగా ఉండొచ్చుమో కాని, అవి సంతోష ఫలాన్ని అందించలేవు. 'సంతోషం' అనే ఆత్మఫలం సిద్ధమైనది, ఎవ్వరూ అపహరించలేనిది, మార్పు చెందనిది. నిత్యత్వం వరకు ప్రభువుతో ముడిపడినది. ఎందుకంటే, 'సంతోషం' మొదట ఆత్మీయ ఫలం. మరి ముఖ్యంగా ప్రభువు ఏర్పరచిన అమూల్యమైన ఆత్మఫలం. ఈ ఫలం మరి ఎక్కువగా ఫలించాలి. మన దైనందిన జీవితంలో పరిశుద్ధాత్మునికి మన విధేయత చొప్పున ఆ ఫలాలు మనందరిలో మరి ఎక్కువగా ఫలించాలి. విద్యార్థుల లోకానికి, మన తోటివారికి 'సంతోషం' అనే ఆత్మీయ ఫలాన్ని పంచియిచ్చే వారసులుగా మార్చమని క్రీస్తు నామంలో తండ్రికి విజ్ఞాపన చేద్దాం •

**డి.అనిల్ కుమార్,** అసోసియేట్ మేనేజర్-క్యూఏ, బయోకాన్ ఫార్మా, రంగారెడ్డి జిల్లా టియస్ చర్చి సెల్ సభ్యునిగా మరియు భెల్ ఇజియఫ్ గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

# సమాధానం



- యం.సుధాకర్

## సమాధానం కోసం ప్రయత్నాలు

శాంతి, సమాధానం కావాలని లోకమంతా ప్రయత్నిస్తుంది కాని అది సాధ్యం కావడం లేదు. మనుష్యులందరు సమాధానం ఇష్టపడతారు, కాని అది దొరకడం లేదు. దీనిని సంపాదించడం కోసం కొందరు ఆస్తులను సంపాదించి, డబ్బును కూడబెడతారు. జ్ఞానం సంపాదించడానికి ప్రయాసపడతారు. మరికొందరు అందంగా కనిపిస్తే సమాధానం వస్తుందని ప్రయాసపడతారు. ఇంకొందరు పలుకుబడి కలిగి సమాధానాన్ని పొందాలని ఆకాంక్షిస్తున్నారు. కాని ఈ సమాధానం ఎవరిని పూర్తిగా పలకరించడం లేదు. అందుకే రకరకాలుగా తాత్కాలిక సమాధానం కోసమైనా తమ సమయాన్ని, డబ్బును వెచ్చిస్తున్నారు. కొందరైతే దురలవాట్లతో సమాధానాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు కానీ సాధ్యం కావడం లేదు.

## సమాధానం ఎక్కడ దొరుకుతుంది?

ఈ సమాధానం ఎప్పుడూ మన సొంతం కావాలంటే ఎక్కడ దొరుకుతుందో తెలియాలి. దీనిని ఎలా పొందుకోవాలో తెలుసుకోవాలి. ఈ సమాధానం పూర్తి ఉచితంగా దొరుకుతుంది. అయితే అది దొరికే స్థలం సమాధానకర్తయగు యేసులో మాత్రమే. యేసు ప్రభువు ఈ లోకం ఇచ్చినట్టుగా తాత్కాలిక శాంతిని ఇవ్వడం లేదు, ఆయన శాంతినే శాశ్వతంగా అనుగ్రహించాడు (యోహా 14:27). ఈ సమాధానం పరిస్థితులతో సంబంధం లేకుండా ఆత్మ దేవుడు మన హృదయాలలో ఉచితంగా కలిగిస్తాడు.

సమాధానం హృదయంలోని కోమలమైన కుసుమం వంటిది. పాపం దాన్ని వాడిపోయేలా చేస్తుంది. దేవుని సమాధానం మన హృదయంలో ఉండి మన చర్యలన్నిటినీ శాసిస్తూ ఉండాలి. మనలోని శాంతిని భంగం చేసే, శాంతికి వ్యతిరేకంగా ఉన్న ఏ పనికైనా దూరంగా ఉండాలి. మనల్ని కంగారులో, భయంలో పడవేసే పనులను మానుకోవాలి. హృదయం ఎప్పుడైతే భయంలో, ఆందోళనలో ఉంటుందో అప్పుడు ఈ సమాధానం మనకు అందని ద్రాక్షాగానే ఉంటుంది.

## సమాధానంగా జీవించాలంటే...

లోకంలో మనకు సమాధానం కలగడానికి యేసు చెప్పిన మాటలు "ఈ లోకంలో మీకు శ్రమ కలుగును అయినను ధైర్యము తెచ్చుకొనుడి, ఎందుకంటే ఆయన లోకాన్ని జయించాడు" (యోహా 16:33). సమాధానంగా ఈ లోకంలో జీవించాలంటే పరిశుద్ధాత్ముడు కలుగజేసే శాంతిని మనం కోల్పోకుండా ఉండాలంటే, దేనిని గూర్చి చింతించకూడదు. ప్రతి పరిస్థితిని దేవునికి ప్రార్థనలతో, విన్నపాలతో, కృతజ్ఞలతో విన్నవిస్తే ఆయన కృప మనకు తోడుగా ఉంటుంది. ఆ శాంతిని కోల్పోకుండా కాపాడుతాడు (ఫిలి 4:6-7). అంతేకాక ద్రాక్షవల్లిలో ఉన్న తీగ బహుగా ఫలించిన రీతిగా మనం కూడ క్రీస్తులో స్థిరంగా నిలిచియుంటే బహుగా ఫలిస్తాం. వేరుగా ఉండి ఫలించలేం. మనందరం బహుగా సమాధానం అనే ఆత్మఫలం ఫలించటానికి

పరిశుద్ధాత్ముడు మనందరికి సహాయం చేయును గాక •

యం.సుధాకర్, లెక్చరర్, ప్రభుత్వ కళాశాల మరియు జహీరాబాద్‌లో ఇజియఫ్ ప్రార్థన కార్యదర్శిగా ఉంటున్నారు.

# ధీర్ఘశాంతం



– రవింద్రనాథ్

### హడావుడి, తొందర...

ఈరోజుల్లో ఎక్కడ చూసిన ప్రజలు హడావుడిగా పరుగెత్తడం గమనిస్తాం. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగినవారు, బస్సులో కూర్చున్నవారు, రైలులో కూర్చున్నవారు తొందరగా వెళ్ళాలని ప్రయత్నిస్తారు. ఇంటర్‌నెట్ స్లో అయినా, బఫరింగ్ అవ్వుతున్నా ఆగకుండా వేరే ప్రత్యామ్నాయాలు వెదుకుతారు. ప్రజల్లో సహనం లేకపోవడం, ఎక్కడ చూసిన ఇదే తంతు గమనిస్తాం. ఇతరులు మనతో సహనం కలిగి ఉండాలని ఆశిస్తాం కాని మనం ఇతరులతో సహనం కలిగి ఉండడాన్ని విస్మరిస్తాం. ఇది మానవ సహజ స్వభావం. ఓపిక లేనితనంతో కుటుంబాలలో, సహవాసంలో మరియు సమాజంలో అనేక సమస్యలు కొని తెచ్చుకొంటున్నాం.

ఇలాంటి పరిస్థితుల్లో "యోబు యొక్క సహనం గూర్చి వింటిరి గదా" (యాకో 5:11) అని బైబిల్లో చూస్తాం. యోబు మొదట దేవుడితో సహనం కలిగి ఉంటాడు. తన స్నేహితులతో కూడా సహనం కలిగి ఉంటాడు. అలాగే తనలో సహనాన్ని కలిగి ఉంటాడు. ధీర్ఘశాంతం పరిశుద్ధాత్మ ఫలం కాబట్టి, మన జీవితంలో సహనం కలిగి ఉండడం నేర్పడానికి దేవుడు మన కుటుంబంలో, సహవాసంలో మరియు సమాజంలో కొందరు వ్యక్తులను మనతో జీవించడానికి అనుగ్రహిస్తాడు.

### ఓపికతో వేచి ఉండాలి

మన జీవితంలో వచ్చే పరీక్షలకు ఓపిక కలిగి వాక్యానుసారంగా ప్రతిస్పందించాలి. అప్పుడు మనం ధీర్ఘశాంతం కలిగి ఉండేలా దేవుడు సహాయం చేస్తాడు. ఈ ప్రకియలో మన ప్రవర్తన, నిర్ణయాలు వాక్యానికి అనుగుణంగా మారుస్తాడు. మన జీవితంలో వచ్చే సవాళ్ళను ఎదుర్కోడానికి సహనం ముఖ్యపాత్ర పోషిస్తుంది.

రోమా 8:28 ఆధారంగా "దేవున్ని సరైన విధంగా అర్థం చేసుకోవడం, ఆయన సార్వభౌమాధికారాన్ని మన జీవితాల్లో కలిగి యున్నామని గ్రహించడం చేత ఓపిక కలిగి ఉండడం నేర్చుకోగలం" అని అంటారు ఛార్లెస్ స్టాన్లీ. అలాగే "వేచి ఉండగల సామర్థ్యం కాదు కాని వేచి ఉన్నప్పుడు మన వైఖరి ఎలా ఉంది, మనం ఎలా వ్యవహరిసామో అదే మన సహనం" అని యాంప్లిఫైడ్ వెర్షన్‌లో ఉంది •

రవింద్రనాథ్, రిటైడ్ స్టేషన్ మేనేజర్, రైల్వేస్ మరిము మంచిర్యాల గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

# దయాళుత్వం



– యస్.పరం జ్యోతి

### ప్రేమలో నుండి దయ వస్తుంది

ఆత్మఫలంలో దయాళుత్వం ఒకటి. దీనిని ప్రతి విశ్వాసి కలిగి ఉండాలి. అప్పుడే మన జీవితం పరిపూర్ణ మవుతుంది. బైబిల్లో "దేవుని చేత ఏర్పరచబడినవారును, పరిపూర్ణులును, ప్రియులైన వారికి తగినట్లు దయాళుత్వమును ధరించుకొనుడని" (కొల3:12) పౌలు చెప్పాడు. ఈ దయాళుత్వం ప్రేమలో నుండి వస్తుంది. అందుకే "ప్రేమ దయ చూపించును" (1 కొరింధీ 13:4) అని పౌలు రాశాడు. "కావున ఒకని యెడల ఒకడు దయకలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్ములను క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకడు క్షమించుడి" (ఎఫె 4:32) అని బైబిల్ చెబుతుంది. దయలో నుండే ఈ క్షమాపణ వస్తుంది. మనలో దయ లేకపోతే హృదయంలో నుండి క్షమాపణ రాదు.

దయ చూపించడంలో మన ప్రభువైన యేసు మనకు మాదిరి. ఆయన మాటలలో ఎంతో దయ ఉంది. సమాజ మందిరంలో ఉన్నవారు ఆయన నోటనుండి వచ్చిన దయగల మాటలకు ఆశ్చర్యపడిరి (లూకా 4:2). క్రీస్తును గురించి "నీ పెదవుల మీద దయారసము పోయబడియున్నది" (కీర్త 45:2) అని బైబిల్లో ఉంది. కావున యేసుక్రీస్తు లోకంలో ఎంతో మాదిరిగా జీవించాడు. వ్యభిచారంలో పట్టబడిన స్త్రీని శాస్త్రులు, పరిసయ్యులు రాళ్ళు రువ్వి చంపవలెనని, ధర్మశాస్త్రము ప్రకారం శిక్షించాలని తలంచారు. కాని యేసు ఆ స్త్రీని చూచి 'అమ్మా' అని పిలిచాడు. "వాళ్ళు ఎక్కడ ఉన్నారు? ఎవరును నీకు శిక్ష విధింపలేదా?" అని అడిగినప్పుడు ఆమె "లేదు ప్రభువా" అనెను. అందుకు యేసు "నేనును నీకు శిక్ష విధింపను. నీవు వెళ్ళి ఇకను పాపం చేయకుమని ఆమెతో చెప్పెను" (యోహా 8:1-11). ఆ పిలుపులో ఎంత దయ కలిగి ఉందో! ఎంతో గౌరవాన్ని ఇచ్చాడు, ఎవ్వరు క్షమించని స్థితిలో ఉన్నవారిని క్షమించడమే దయ.

## దయ కలిగి ఉంటే క్షమించగలం

మనం విశ్వాస జీవితంలో ఇతరులను నిందిస్తాం. శిక్షకు పాత్రులనుగా ఎంచుతాం. వారి లోపాలను ఎత్తిచూపి బాధకు గురిచేస్తాం. కాని క్రీస్తులాంటి దయను మనం కలిగి ఉంటే మన తోటివారిని క్షమించడం, ప్రేమించడం ఎంతో సులువు అవుతుంది. అంతేకాదు ఆయన లాగా ప్రవర్తిస్తాం.

పాపాత్మురాలైన స్త్రీ పట్ల దేవుని వైఖరిని లూకా 7:47లో చూస్తాం. దేవుని దయను బట్టి ఆమె విస్తారమైన పాపములు క్షమించబడినవి. ఎలాంటి పాపం చేసిన వారైన సరే పశ్చాత్తాపంతో వచ్చినప్పుడు దేవుడు తన దయను బట్టి ఎప్పుడు ఎవ్వరిని త్రోసివేయడు, వేయలేదు. లూకా 19వ అధ్యాయంలో జక్కయ్య సుంకపు గుత్తదారుడును, ధనవంతుడును, పాపియైన మనుష్యుడైనప్పటికీ యేసు అతని పట్ల ఎంతో దయగలిగి ఆయనను క్షమించి, రక్షించాడు. అటువంటి దయ లేకపోతే మనం, మన కుటుంబంలో ఉన్నవారిని, వారి ప్రవర్తనను బట్టి ద్వేషించేవారంగా ఉంటాం. మన తోటి సహోద్యోగులను సైతం మనం ప్రేమించడం, క్షమించడం కష్టమవుతుంది.

## కుటుంబంలో కూడా దయ చూపించాలి

మన కుటుంబస్థులైనా, సహోద్యోగులైనా, విద్యార్థులైనా మనలను హింసించి, నిందించి, అన్యాయంగా మాట్లాడినప్పుడు అలాంటి వారి పట్ల క్రీస్తువలె మనం దయ కలిగి ఉండాలని దేవుని ప్రగాఢమైన కోరిక. చాలాసార్లు బయట వారిపట్ల దయకలిగి ఉంటాం కానీ కుటుంబంలో దయను చూపించలేం. భార్య, భర్త, పిల్లలు ఒకరిపట్ల ఒకరు దయకలిగి కరుణాహృదయులై ఉండాలి. "యెహోవా దయాళుడు, ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి, ఆయన కృప నిరంతరముండును" (కీర్త 136:1) అని బైబిల్ చెబుతుంది.

యేసు మనకొరకు మరణించాడు. మన పట్ల దయా హృదయం కలిగి తన ప్రాణాలను త్యాగం చేసాడు. మనం యోగ్యులం కాకపోయిన ఆయన దయను, కృపను పొందాం. మనం కూడా ఇతరుల పట్ల దయగలిగి ఉండాలి. దయ మన జీవన విధానంగా, వైఖరిగా మారాలి. మనం దేవునితో నడిచినప్పుడు, ఆయనతో సహవాసం చేసినప్పుడు ఆయన మన వైఖరి మార్చగలడు. కాబట్టి మన వైఖరి మార్చుకొని ఒకరి యెడల ఒకరం దయ కలిగి ఉందాం. ప్రతి విషయంలో ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లిద్దాం. ఆయన దయతో మనలను క్షమించిన ప్రకారం మనం కూడ దయను చూపి ఇతరులను క్షమిద్దాం. దయ ఎప్పుడూ పొందుకోవాలని చూడదు కాని ఇవ్వాలని చూస్తుంది.

## దయను కలిగి ఉండాలంటే...

ఈ దయను మనం కలిగి ఉండాలంటే ప్రతిరోజు దాని గురించి ప్రార్థించాలి, ఆయన సహాయం కోరాలి. దీనిని పొందుకోవడానికి మనం ధృడ సంకల్పాన్ని కలిగియుండాలి. దయ చాలా మంచి మాట. "నా కాడి సులువుగా ఉన్నది" అని యేసు తన శిష్యులతో పలికిన మాటలో దయ ఉంది (మత్త 11:30). ఈ కాడిని మోయటం తేలిక. దేవునితో సంబంధం, సహవాసం కలిగి ఉన్నప్పుడు మాత్రమే ఈ దయా హృదయం మనం కలిగి ఉంటాం. దేవుడు మనలను మరింత సహనశీలురుగా, దయాళులుగా చేయును గాక! •

**యస్.పరం జోత్యి,** నర్సింగ్ ట్యూటర్, గాంధీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ మరియు ఇయన్ఎఫ్ఐ-టియస్ కార్యదర్శిగా ఉంటున్నారు

# మంచితనం



**– టి.జీవ రత్నం**

## మంచితనం అందరికీ ఇష్టమే

మానవ జీవితంలో మంచితనం కొన్ని సందర్భాల్లోనే కనబడుతోంది. ఎందుకంటే మానవుడు జన్మతః పాపి. అందుకే అతనిలో మంచితనం కొరవడింది. అయినప్పటికి మానవులు మంచితనాన్ని ఇష్టపడతారు. ఒకసారి ప్రభువైన యేసు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగి యుండగా..." (మత్త 7:10) అన్నాడు. నిజమే! మానవులు చెడ్డవారైయుండి మంచి ఫలాలను ఇవ్వాలని అనుకుంటారు, కోరుకొంటారు. మానవులకు అది సాధ్యం కాదు కానీ దేవునికి సాధ్యమే. ఎందుకంటే దేవుడు మంచివాడు. ఆయన ఒక సందర్భంలో మోషేతో, "నా మంచితనమంతయు నీ యెదుట కనపరచెదను" (నిర్గ 33:19) అని చెప్పాడు. కాబట్టి మంచివాడైన దేవునియందు ఎవరు నమ్మకం ఉంచుతారో వారికి ఆయన తన మంచితనాన్ని దయచేస్తాడు. బైబిల్లో అబ్రాము దేవున్ని నమ్మాడు కాబట్టి దేవుడు అతనిని నీతిమంతుడిగా లేక మంచివాడిగా తీర్చాడు.

మానవుడు దేవున్ని నమ్మిన తర్వాత అతనిలోని చెడుతనం తొలగి మంచితనం వస్తుంది. మానవునిలోని చెడును తొలగించి అతడిని మంచివానిగా మార్చడానికే యేసుక్రీస్తు ఈ లోకంలోకి వచ్చాడు. దేవుని వాక్యమైన బైబిల్లో యేసు మంచితనమంతా మనకు కనిపిస్తుంది. స్వతహాగా మానవునిలో పాప స్వభావాన్ని బట్టి మంచితనం లేదు. అయితే దేవున్ని నమ్మినవారు దేవున్ని బట్టి మంచి పనులు చేస్తారు. అందుకే ఆత్మ మూలముగా జన్మించిన ప్రతి ఒక్కరిలో మంచి చేయాలా లేక చెడు చేయాలా అనే పోరాటం ఉంటుంది. ఈ పోరాటంలో ఆత్మానుసారంగా జీవించటానికి ఇష్టపడితే, చెడును విడిచి మంచితనం అనే ఆత్మఫలాన్ని చూపించగలం. బైబిల్లో పౌలు తన జీవితంలో మంచితనం అనే ఆత్మఫలాన్ని కోరి మంచి పోరాటం పోరాడాడు.

## మంచితనంతో మేలు చేశారు

బైబిల్లో యోసేపు మంచితనం అనే ఆత్మఫలం కలిగియున్నాడు కాబట్టే కీడు చేసిన తన సహోదరులను ప్రేమించగలిగాడు. మోషే తన మంచితనంతో ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి బయటకు తీసుకువచ్చాడు. రాజైన దావీదు మంచివాడిగా ఉండి దేవునికి ఇష్టుడిగా మారాడు. రూతు మంచితనంతో అత్త నయోమికి మేలు చేసింది. దానియేలు మంచితనంతో జ్ఞానులు చనిపోకుండ రక్షించాడు. యేసు దర్శించిన తర్వాత పొట్టి జక్కయ్య చెడునుండి వైదొలగి మంచి వ్యక్తిగా మారాడు. హింసకుడు, హానికరుడైన సౌలు దేవున్ని తెలుసుకొని మంచివాడుగా మారి గొప్ప సేవ చేశాడు. ఇలాంటి అనేకమంది వ్యక్తులను బైబిల్ గ్రంథంలో మనం చూడవచ్చు.

ఈతరంలో మన పితరులైన ప్రొ॥ ఇనాక్, డా॥ నార్టన్ స్టైరెట్, సహోదరులు చాందపిళ్ళ, సత్యీర్తిరావు, పిసి వర్గీస్, దీనబందు లాంటి అనేకమంది మంచితనాన్ని ఆత్మఫలంగా కలిగి మనమధ్య జీవించారు, మనకు మాదిరిగా నిలిచారు. ఇలా యుఇయస్ఐ పరిచర్య కోసం ఎందరో తమ మంచితనంతో త్యాగాలు చేయబట్టే ఈ విద్యార్థి పరిచర్య ఇంతవరకు నిలచింది. ఈ పరిచర్య భవిష్యత్తులో నిలబడాలంటే మనం అలాంటి మంచితనం కలిగి జీవించాలి. మనతోటి విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు, స్టాఫ్ మరియు ఇతరుల పట్ల అలాంటి మంచితనం చూపించి మాదిరి కనపరచాలి. మనం అలాంటి మంచితనం కలిగి అనేకుల కొరకు ముఖ్యంగా దేవుని కొరకు జీవిద్దాం. ఒక శ్రేష్టమైన మంచి జీవితం జీవించుటకు ప్రభువు మనకు సహాయం చేయును గాక! •

---

**టి.జీవరత్నం,** స్కూల్ అసిస్టెంట్, మరియు నిర్మల్ గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

# విశ్వాసం



**- సుష్మా ప్రభాకర్**

## విశ్వాసం లేకపోతే...

ఆత్మఫలంలో విశ్వాసం చాలా ప్రాముఖ్యమైనది. విశ్వాసమనగా ''నిరీక్షింపబడువాటి యొుక్క నిజసర్వాపమును, అదృశ్యమైనవి యున్నవి అనుటకు రుజువునైయున్నది'' (హెబ్రీ 11:1). మనం విశ్వాసమును బట్టి కృప చేతనే మనం రక్షించబడ్డాం. విశ్వాసముకు వ్యతిరేకపదం సందేహించడం లేక నమ్మకం లేకపోవడం. ఇది ఎంతో ప్రమాదకరమైనది.

బైబిల్లో "సందేహించువాడు గాలిచేత రేపబడు సముద్ర తరంగాలను పోలియుండును. అట్టివాడు అస్థిరుడు, తనకు ప్రభువు వలన ఏమైన దొరుకునని తలంచుకొనరాదు" (యాకో 1:7-8) అని ఉంది. యేసు తన స్వదేశములో ఎక్కువ ఆశ్చర్యకార్యాలు చేయకుండ ఉండుటకు వారి అవిశ్వాసమే కారణం (మత్త 13:58, మార్కు 6:5). ఆయన తన శిష్యులపై కోపపడిన కారణం వారికి విశ్వాసం లేకపోవడమే (మత్త 17:17). మన వ్యక్తిగత, కుటుంబ జీవితాల్లో దేవుని ఉద్దేశాలు నెరవేరకుండా అడ్డుకునేది మన అవిశ్వాసమేనా? ఆలోచిద్దాం!

## విశ్వాసం మనకు మేలు చేస్తుంది

"విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యం" (హెబ్రీ 11:6) అని బైబిల్ చెబుతోంది. దేవునికి ఇష్టుడుగా ఉండాలంటే విశ్వాసమును కలిగి యుండాలి. విశ్వాసంకు మరో అర్థం నమ్మటం. బైబిల్లో 12 సం॥రాల నుండి రక్త స్రావ రోగంతో బాధపడుచున్న స్త్రీకి స్వస్థత చేకూర్చింది ఆమె విశ్వాసమే (మార్కు 5:34). గ్రుడ్డివారికి చూపునిచ్చింది వాని నమ్మకమే (మత్త 9:27-29). పక్షవాయువు గలవానికి స్వస్థత చేకూర్చింది, పాపములు క్షమించబడుటకు కారణం అతనిని తెచ్చిన వారి విశ్వాసమే.

విశ్వాసులకు తండ్రైన అబ్రాహాము దేవున్ని ఎంతగా ప్రేమించాడో, నమ్మాడో వాక్యంలో చూస్తాం. దేవుని మాట ప్రకారం సొంత ప్రజలను, ప్రదేశాన్ని విడిచి పెట్టాడు. ఏకైక కుమారుని దేవునికి బలి ఇవ్వడానికి ఇష్టపడ్డాడు. అబ్రహాము తన విశ్వాసాన్ని క్రియల్లో చూపించాడు కనుక నీతిమంతునిగా ఎంచబడ్డాడు.

## విశ్వాసాన్ని క్రియల్లో చూపాలి

మన విశ్వాసం క్రియలతో కూడినది కాకపోతే అది నిష్ఫలమైనది (యాకో 2:20-23). హెబ్రీ11లో ఎంతోమంది విశ్వాస వీరులు మనకు సాక్షులుగా కనబడతారు. వారిని గుర్తుకు తెచ్చుకుందాం. మనం దేవున్ని హృదయం అంతటితో ప్రేమించినప్పుడు మాత్రమే ఆయనయందు విశ్వాసము ఉంచగలం. అలాంటి విశ్వాసం మనకు ఉందా? చాలాసార్లు మనం ఆర్థిక ఇబ్బందుల్లో లేక అనారోగ్య పరిస్థితుల్లో మాత్రమే విశ్వాసంను కనపరుస్తాం. అయితే మన జీవితంలోని ప్రతి పరిస్థితికి దేవుడు సరిపోయిన వాడు. ప్రతి సమస్యకు ఆయన యొద్ద మాత్రమే పరిష్కారం ఉంది. మన జీవితంలోని ప్రతి స్థితికి, పరిస్థితికి ఆయనే సరిపోయిన దేవుడు.


## విశ్వాసాన్ని పెంపొందించుకొనేదెలా?

ప్రభువు ఎంత గొప్పవాడో, ఆయనలో భాగ్యం ఎంత ఉన్నతమైనదో అర్థం చేసుకొని చూడగల విశ్వాసపు కన్నులు దయచేయు ప్రభువా అని ప్రార్థిద్దాం. మన కొరకు మాత్రమే కాక, ఇతరుల జీవితాలలో కూడ దేవుని ఉద్దేశాలు నెరవేరాలని విశ్వాసంతో ప్రార్థిద్దామా? ఆత్మఫలం మన జీవితం ద్వారా కనపరచబడడం ఆత్మీయ జీవితంలో పరిపక్వతకు నిదర్శనం. మన విశ్వాసపు పరిమాణాన్ని పెంపొందించుకుందాం. మన వ్యక్తిగత, కుటుంబ, పరిచర్య మరియు సమాజంలో ఎదుర్కొనే ప్రతి సమస్యను, ఇబ్బందికరమైన పరిస్థితులను గురించి విశ్వాసంతో ప్రభువు దగ్గరకు తీసుకొద్దాం. మన జీవితం ప్రభువు చేతిలో భద్రంగా ఉంది అనే విషయాన్ని జ్ఞాపకం చేసుకుందాం.

ఆయన త్వరలో రానైయుండగా, పౌలువలె "నా పరుగు తుదముట్టించితిని, నా విశ్వాసమును కాపాడుకుంటిని; నా కొరకు నీతి కిరీటం ఉంచబడి యున్నది" అని ఎరిగి ఆయన అప్పగించిన పనిని నమ్మకంగా చేసాను అని మంచి ధైర్యముతో చెప్పగలిగేలా సాధన చేసుకొందాం. మన విశ్వాసమును అంతము వరకు కాపాడుకుందాం, గట్టిగా పట్టుకొందాం. ప్రభువు అట్టి కృపతో మనలను నింపి తన మహిమ కొరకు నడిపించును గాక! •

**సుష్మా ప్రభాకర్,** స్టాఫ్, సంగారెడ్డి

# సాత్వికం



– వి. రవి ప్రసాద్

మనం పండ్లను పరిశీలించి ఎంచుకొన్నట్లు, ఆత్మఫలం విశ్వాసి జీవితంలో వివిధ కోణాల్లో ఫలిస్తూ దేవుని ప్రణాళికలు నెరవేర్చడానికి ఆర్భుల్ని చేస్తుంది. వాటిలో సాత్వికం ఒక కోణం. ఎదుటివారికి బాధ కలిగించేట్లు మాట్లాడటం, ప్రవర్తించటం, వారిలో తప్పులను ఎత్తిచూపుతూ కించపరచడం, మనకంటే తక్కువవారిని, ఇష్టంలేనివారిని చులకనగా, తక్కువచేసి మాట్లాడడం, నిర్లక్షధోరణి కలిగివుండడం మొదలైనవి మృదుత్వం, సాత్వికం లోపంవల్ల జరిగే పరిణామాలు.

## సాత్వికానికి మూల్యం

మన గొప్పతనాన్ని బట్టి అతిశయించడానికి అవకాశం లేకుండా, మనం బలహీనస్థితిలో ఉన్నప్పుడే దేవుడు మనలను ఏర్పరచుకొని, ఆయనే మన అతిశయంగా ఉండటానికి యేసుక్రీస్తు సిలువలో మనకోసం మూల్యంగా చెల్లించబడ్డాడు (1 కొరిం 1:26). మనం ఆయన అడుగుజాడలలో, మాదిరిలో నడుచుకోవాలని మనలను పిలిచాడు, మన కోసం శ్రమపడ్డాడు (1 పేతు 2:21). అందుకే యేసుక్రీస్తు "నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకోమని" చెప్పాడు (మత్త 11:29).

## సాత్వికానికి మాదిరి

మోషే ఐగుప్తు సకల విద్యలను అభ్యసించి, మాటలయందును కార్యములయందును ప్రవీణుడై యుండికూడా విశ్వాసమునుబట్టి ఐగుప్తు ధన ఘనత కంటే, క్రీస్తువిషయమైన శ్రమ, నింద గొప్పదని యెంచి దేవుని ప్రణాళికలకు తగ్గట్టుగా సాత్వికంగా జీవిస్తూ ప్రతిఫలముగా కలుగబోవు వాటి మీద దృష్టియుంచాడు (అపొ 7:22, హెబ్రీ 11:25-26). నమ్మకంగా జీవించాడు, సాత్వికానికి బహుమానంగా దేవుని ధర్మశాస్త్రం, ఇశ్రాయేలీయుల విషయంలో గొప్ప ఘనతను సంపాదించుకొన్నాడు (మత్త 5:5). "మోషే భూమి మీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు" అని దేవుడే సాక్ష్యమిచ్చాడు (సంఖ్యా 12:3). దేవుడు మన గురించి ఏమని సాక్ష్యమిస్తాడు?

## సాత్వికమైన మనస్సు

సాత్వికమైన మనస్సు మృదువుగా మాట్లాడుతుంది. క్రోధమును చల్లార్చి, కోపమును తీసివేసేస్తుంది. దారితప్పిన విశ్వాసిని సరైన మార్గంలోకి తీసుకువస్తుంది (గలతీ 6:1). మనలను వ్యతిరేకిస్తున్నవారిని కూడా మన సాత్వికంద్వారా దేవుడు సత్య మార్గంలోకి తీసుకువస్తాడు (2 తిమో2:25). దేవుని చేత ఏర్పరచబడినవారికి ఇది ఒక రుజువు (కొలస్సి 3:12). పవిత్రమైన దేవుని జ్ఞానాన్ని ప్రతిబింబించేటట్లుగా సాత్వికంతో నిండిన మృధువైన ప్రవర్తనను కలిగి ఉందాం (యాకో 3:13,17). దేవుని దృష్టిలో మిగుల విలువ కలిగిన అక్షయాలంకారమును మన అలంకారముగా పెట్టుకొని, సాధువైనట్టియు, మృదువైనట్టియునైన సాత్వికమనే గుణమును కలిగి ఉందాం (1పేతు 3:4). భావితరానికి సాత్వికం విషయంలో మౌలికాలు స్థాపించవలసిన బాధ్యత, భారం మనం చేపడదాం (2 కొరిం 10:1) •

**వి.రవి ప్రసాద్,** ఏరోస్పేస్ ఆర్ అండ్ డి విభాగంలో పనిచేస్తున్నారు మరియు సైదాబాద్ గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

# ఆశానిగ్రహం



– జె.రాజు

## ఆశానిగ్రహం అత్యవసరం

ఆత్మఫలంలో చివరిగా ప్రస్తావించబడిన లక్షణం ఆశానిగ్రహం. జాబితాలో చివరిగా ఉన్నా క్రైస్తవుని ఆధ్యాత్మిక జీవితంలో ఆత్మీయంగా బహుగా ఫలించాలంటే ఆత్మనిగ్రహం చాల అవసరం. మనల్ని మనం నిగ్రహించుకోగలిగిన సామర్థ్యమే ఆశానిగ్రహం. మన శరీరాశలను, భావోద్వేగాలను, ప్రవర్తనను ఆత్మానుసారంగా, ఆత్మశక్తిచేత లోబరచుకోగలిగిన సామర్థ్యమే ఆశానిగ్రహం. ఈ ఆశానిగ్రహం మనకు పాపాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని ఇస్తుంది.

లోకానుసారంగా జీవించాలనే ఆశను చంపి వేయడానికి, శోధనలను ఎదుర్కోవడానికి, పాపాన్ని జయించడానికి, మనకు ఉపయోగపడే ఆయుధం ఆశానిగ్రహం. జయజీవితం జీవించడానికి, ఆత్మలో బహుగా ఫలించడానికి అవసరమైన లక్షణం. ఎందుకంటే ఆత్మఫలంలో ప్రస్తావించిన లక్షణాలలో దాదాపు అన్నీ ఆత్మను, శరీరాన్ని నిగ్రహించుకోవడం ద్వారానే వృద్ధిచెందుతాయి. మనల్ని మనం నియంత్రించు కోవడం కేవలం నిరంతర సాధన ద్వారానే సాధ్యం.

## ఆశానిగ్రహాన్ని సాధన చేసేదెలా?

క్రైస్తవ జీవితం ఆత్మకు, శరీరానికి మధ్య జరిగే యుద్ధ రంగం. ఈ యుద్ధం మనిషి భూమిని విడిచి వెళ్ళేవరకు కొనసాగుతుంది. శరీరానుసారంగా నడిచేవారు శరీరకార్యాలను జరిగిస్తూ పరలోక భాగ్యాన్ని పోగొట్టు కుంటారు (గల 5:19-21). అదెంతో బాధాకరం. ఈ శరీర కార్యాలను జరిగించడానికి మూలకారణం వారిలో లోపించిన నిగ్రహశక్తి.

వాక్యధ్యానం ద్వారా మన మనస్సును నూతన పర్చుకుంటూ దేవుని చిత్తాన్ని ఎరిగి జీవించాలి. ప్రతి సందర్భంలో, ప్రతి పోరాటంలో పరిశుద్ధాత్ముని సహాయం అర్థించాలి. పౌలువలె దినదినం శరీరాన్ని దాని ఇచ్ఛలను నలుగగొట్టుకొంటూ క్రీస్తు సిలువ శ్రమానుభవం ద్వారా ప్రాణాత్మ దేహాలను లోబరుచుకోవాలి.

## ఆశానిగ్రహం లేకపోతే నష్టమే

ఆశానిగ్రహం లేక నష్టాల పాలైన ఎంతో మందిని బైబిల్‌లో చూస్తాం. ఏశావు, సంసోను, దావీదు, అననీయ, సప్పీర మొ॥వారు ఆశానిగ్రహం లేక జీవితాన్ని నష్టపరచుకొన్నారు. అయితే పరిశుద్ధంగా జీవించాలనే తృష్ణతో, దేవునికి ఇష్టులుగా ఉండాలనుకుని నిష్ఠగా జీవించి, దేవుని మహిమపరిచిన యోసేపు, దానియేలు వంటివారు కూడా ఉన్నారు. ఎంతమందిని చూసినా, ఎన్ని ఉదాహరణలు చెప్పుకొన్నా చివరికి ఆగాల్సింది ఒక్క చోటనే... అది మన ప్రభువు దగ్గరే.

యేసు 40 రాత్రింబవళ్ళు ఉపవాసముండిన తర్వాత అపవాదిచే శోధింపబడ్డారు. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబాలను ఆయుధాలుగా చేసుకుని శోధకుడు శోధించినప్పుడు నిగ్రహంతో వాక్యాధారంగా వాడికి బుద్ధిచెప్పి గద్దించి తరిమాడు. ఆ విధంగా మనం కూడా అపవాది ఎరగా వేసే ప్రతిదానిని వివేచనతో గమనించి వాడిని ఎదిరించాలి. ప్రభువే మన మాదిరి. ప్రతి ఒక్కరం క్రీస్తు శక్తిని ఆశ్రయించి యుద్ధరంగంలో ప్రభువును సంతోషపెట్టేవారంగా ఆశానిగ్రహంతో జయ జీవితం జీవిస్తూ దేవునికి మహిమకరంగా ఉందాం •

**జె.రాజు,** ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు మరియు సంగారెడ్డిలో గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

* * * * * * * * *





Prayer requires more of the heart than of the tongue
- Adam Clarke

# ఫిబ్రవరి 2021
# ప్రార్థనాంశాలు

**నార్త్ తెలంగాణ**

రీజినల్ కో-ఆర్డినేటర్: సహెూ. కె. శ్రీనివాస్
డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్:
ఆదిలాబాద్ - సహెూ.లూథర్ కింగ్
కరీంనగర్ - సహెూ.డి.రాము
స్టాఫ్:
కరీంనగర్ - సహెూ.ఎన్.మోహన్ & సహెూదరి స్నేహ లత
స్టాఫ్ కో-ఆర్డినేటర్ : ఆదిలాబాద్ - సహెూ. సి.రఘుపతి

**సిరిసిల్ల:** క్రమంగా జరుగుచున్న ఇయు, ఇజియఫ్‌లను బట్టి స్తుతించండి.

విద్యార్థుల ఆత్మీయ ఎదుగుదల, స్టడీస్, గ్రాడ్యుయేట్లు పరిచర్య మరియు జాబ్ బాలెన్స్ చేయునట్లు, బైబిల్ స్టడీస్, యంపిసిలు క్రమంగా జరుగునట్లు ప్రార్థించండి.

**జేఎన్‌టీయూ, కొండగట్టు:** అకడమిక్ ఇయర్‌లో పరిచర్య, ఫ్రెషర్స్ కాంటాక్ట్స్ కొరకు, సహవాసంలో ఐక్యత, గేట్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతున్న స్టూడెంట్స్ నిమిత్తం ప్రార్థించండి.

**జేఎన్‌టీయూ, మంథని:** సెమిస్టర్ ఎగ్జామ్స్ రిజల్ట్స్, ఇయర్ ప్లాన్ అమలు, విద్యార్థులు స్టడీస్‌లో ఎక్సెల్ అగునట్లు, అందరి ఆత్మీయ ఎదుగుదల, పరిచర్యలో చురుకుగా పాల్గొనునట్లు ప్రార్థించండి.

**కరీంనగర్:** డిటి క్యాంప్‌కు హాజరయ్యే విద్యార్థుల కొరకు, బైబిల్ స్టడీస్ క్రమంగా, అర్థవంతంగా జరుగునట్లు, స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ పరిచర్యను మరియు పర్సనల్ లైఫ్‌ను బాలెన్స్ చేసుకొనునట్లు ప్రార్థించండి.

**కాటారం:** జరుగుచున్న ప్రాత:కాల ప్రార్థనలను బట్టి స్తుతించండి.

బ్రదర్ దేవిడ్ నిబంధన్ రాజ్ ఆరోగ్యం, అన్‌రీచ్‌డ్ ప్లేసెస్ నిమిత్తం ప్రార్థించండి.

**ఈస్ట్ తెలంగాణ**

రీజినల్ కో-ఆర్డినేటర్: సహెూ.వేణు
డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్:
ఖమ్మం - సహెూ.దయాకర్
వరంగల్ - సహెూ.యం.అనీల్
స్టాఫ్:
వరంగల్ - సహెూ.రాజేష్ దాసరి & సహెూదరి జ్యోతి

**వరంగల్:** జరిగిన ఫస్ట్ సెమిస్టర్ ఎగ్జామ్స్, ప్రస్తుతం ఉన్న కొందరు దర్శనం కలిగిన స్టూడెంట్స్‌ను బట్టి స్తుతించండి.

పరిచర్యలో దేవుని నడిపింపు, బిబియస్ మరియు ఇబియస్ క్రమంగా జరుగునట్లు, నూతన విద్యార్థులను క్రొత్త పద్ధతులలో రీచ్ అగునట్లు, విశ్వాస విద్యార్థులు సహవాసంలో, దేవునిలో ఎదుగునట్లు ప్రార్థించండి.

**పాల్వంచ:** సింగిల్ గ్రాడ్యుయేట్స్ కొరకు, లోకల్ స్టూడెంట్స్‌ను రీచ్ అగునట్లు, స్టూడెంట్స్ స్టడీస్, కెరీర్ మరియు ఆత్మీయ ఎదుగుదల నిమిత్తం ప్రార్థించండి.

**వెస్ట్ తెలంగాణ**

రీజినల్ కో-ఆర్డినేటర్: సహెూ. ఆర్. వినయ్ కుమార్
డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్: నిజామాబాద్ - సహెూ. జి. మహారాజ్
మెదక్ - సహెూ. పి. నరేందర్
స్టాఫ్:
ఆర్మూర్-సహెూ.కె.రవికుమార్ & సహెూదరి అరుణ కుమారి
సంగారెడ్డి - సహెూ.సి. హెచ్.ప్రభాకర్ & సహెూదరి సుష్మ
స్టాఫ్ ఆన్ ప్రొబేషన్: సిద్ధిపేట-సహెూ.సి.సిహెచ్.నాగరాజ్

**సంగారెడ్డి:** క్రమంగా, అర్థవంతంగా జరుగుచున్న బైబిల్ స్టడీస్ కొరకు స్తుతించండి.

గ్రాడ్యుయేట్ కుటుంబాలు, పిల్లల ఆరోగ్యం, స్టూడెంట్స్ స్టడీస్, క్రిస్మస్ ప్రోగ్రామ్స్ మరియు ఫాలో అప్ కొరకు ప్రార్థించండి.

**సిద్దిపేట:** జరిగిన బాయ్స్ మరియు గర్ల్స్ సెమీ క్రిస్మస్, రెగ్యులర్‌గా జరుగుచున్న ఇజియఫ్, మెడికల్ కాలేజీ గర్ల్స్ ఇబియస్, నూతనంగా చేర్చబడిన కృష్ణ కుటుంబం, సిస్టర్ శ్రీవాణి తండ్రిగారి ఆరోగ్యమును బట్టి స్తుతించండి.

బ్రదర్ నాగరాజు స్టాఫ్ సిద్దిపేటలో ఉండటానికి కావలసిన వనరుల కొరకు, జరిగిన సెమీ క్రిస్మస్ ఫాలో అప్, బాయ్స్ బిబియస్ క్రమంగా జరుగునట్లు, నిరుద్యోగ గ్రాడ్యుయేట్ల కొరకు ప్రార్థించండి.

**మెదక్:** బ్రదర్ సైదా లాబ్ మేనేజర్‌గా నియమించబడి నందుకు, హార్ట్ ప్రాబ్లమ్‌తో బాధపడుచున్న బ్రదర్ వెంకటరత్నం కొరకు, బ్రదర్ ఆనంద్ దంపతులకు చిల్డ్రన్ కొరకు, సిస్టర్ సునీత సుధాకర్ జాబ్ నిమిత్తం ప్రార్థించండి.

**కామారెడ్డి:** డిగ్రీ స్టూడెంట్స్‌కు దేవుడు అనుగ్రహించిన మంచి ఫలితాలను బట్టి స్తుతించండి.

బిబియస్‌లు, యంపిసిలు క్రమంగా, అర్థవంతంగా జరుగునట్లు, అప్‌కమింగ్ ప్రోగ్రామ్స్ కొరకు, అందరి ఆత్మీయ ఎదుగుదల నిమిత్తం ప్రార్థించండి.

**పటాన్‌చెరు:** రెగ్యులర్ ఇ.యు, ఇ.జి.యఫ్ బైబిల్ స్టడీస్, భౌతిక బైబిలు స్టడీస్ సమావేశాలు, రెగ్యులర్ కాంట్రిబ్యూషన్స్ బట్టి స్తుతించండి.

క్రొత్త విద్యార్థుల ఫాలో అప్, రెగ్యులర్ ఇ.యు, ఇ.జి.యఫ్ బైబిల్ స్టడీస్, యంపిసిలు, విద్యార్థుల పరీక్షల నిమిత్తం ప్రార్థించండి.

**సెంట్రల్ తెలంగాణ**

**రీజినల్ కో–ఆర్డినేటర్:** సహో. బి. దేవరాజ్
**డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్స్:** హైదరాబాద్ – సహో. వై. సత్యవేలు
రంగారెడ్డి – సహో. సి. శ్రీకాంత్
**స్టాఫ్:**
హైదరాబాద్– సహో.కె.గాబ్రియేల్ & సహోదరి నీతూ మస్సీ
రంగారెడ్డి–సహో.ఎ.అప్పారావ్ & సహోదరి సుజానా వెస్టన్
కూకట్‌పల్లి – సహో.జి.సందీప్ & సహోదరి సుమ సింధూరి
**స్టాఫ్ ఆన్ ప్రొబేషన్:** హైదరాబాద్ – సహో. రాజ్ కుమార్

**సనత్‌నగర్:** క్రమంగా జరుగుచున్న ఇయు మరియు ఇజియఫ్‌ను బట్టి స్తుతించండి.

బ్రదర్ సాల్మన్ జాబ్, బ్రదర్ విశాల్ సెటిల్మెంట్ మరియు వివాహం, సింగిల్ గ్రాడ్యుయేట్స్ వివాహాల నిమిత్తం ప్రార్థించండి.

**కూకట్‌పల్లి:** డిసెంబర్ 27న జరిగిన న్యూ ఇయర్ న్యూ బిగినింగ్స్ ప్రోగ్రామ్, అటెండ్ అయిన 27 స్టూడెంట్స్‌ను బట్టి స్తుతించండి.

అప్‌కమింగ్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్స్ ఆత్మీయంగా ఎదుగునట్లు, బైబిల్ స్టడీస్ అటెండ్ అగుటలో ఇతర విశ్వాస విద్యార్థులు ఎదుర్కొనుచున్న సమస్యలు తొలగునట్లు, మెంటరింగ్ సరిగ్గా జరుగునట్లు, సింగిల్ గ్రాడ్యుయేట్ల సెటిల్మెంట్ నిమిత్తం ప్రార్థించండి.

**బిహెచ్ఇయల్:** జరిగిన ఆన్‌లైన్ క్రిస్మస్ ప్రోగ్రామ్, ఇ–క్యాంప్, బ్రదర్ రాంబాబు, సిస్టర్ రూప దంపతులకు దేవుడు అనుగ్రహించిన కుమార్తెను బట్టి, బ్రదర్ సాలుబాబు కుమార్తెకు జరిగిన ఆపరేషన్ బట్టి స్తుతించండి.

స్టూడెంట్స్ ఫాలో అప్, ఆన్‌లైన్ బైబిల్ స్టడీస్ అర్థవంతంగా జరుగునట్లు, ఔట్‌గోయింగ్ స్టూడెంట్స్ కెరీర్ మరియు సెటిల్మెంట్, బ్రదర్ మణికంఠ కుమారుని ఆరోగ్యం, సిస్టర్ మెర్సీ ఆరోగ్యం మరియు సుఖప్రసవం నిమిత్తం ప్రార్థించండి.

**ఉప్పల్:** బ్రదర్ సుదర్శన్ కోవిడ్ నుండి కోలుకున్నందుకు, బ్రదర్ జాన్సన్ మరియు బిడ్డల కొరకు, సిస్టర్ మనీషా రాసిన ఎగ్జామ్స్‌ను బట్టి స్తుతించండి.

స్టూడెంట్స్ ఆత్మీయ ఎదుగుదల, గ్రాడ్యుయేట్స్ అందరు పరిచర్యలో చురుకుగా పాల్గొనునట్లు, బ్రదర్ సుదర్శన్ తల్లిగారి స్వస్థత కొరకు ప్రార్థించండి.

**సైనిక్‌పురి:** జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్, ఫాలో అప్, గర్ల్స్ ఇబియస్‌ను బట్టి స్తుతించండి.

బ్రదర్ సతీష్ తల్లిగారి ఆరోగ్యం, సింగిల్ గ్రాడ్యుయేట్ల సెటిల్మెంట్, స్టూడెంట్స్ అందరు పరిచర్యలో చురుకుగా పాల్గొనునట్లు ప్రార్థించండి.

**వికారాబాద్:** సిస్టర్ ప్రియాంకకు సుఖప్రసవం మరియు దేవుడు అనుగ్రహించిన కుమార్తెను బట్టి స్తుతించండి.

బైబిల్ స్టడీస్ అర్థవంతంగా జరుగునట్లు, ఇబియస్ స్టార్ట్ అగునట్లు, క్రొత్త స్టూడెంట్స్ కొరకు ప్రార్థించండి.

**జీడిమెట్ల:** న్యూ లోకల్ స్టూడెంట్స్ కాంటాక్ట్స్‌ను బట్టి స్తుతించండి.

పరిచర్యలో దేవుని నడిపింపు, బైబిల్ స్టడీస్ క్రమంగా మరియు అర్థవంతంగా జరుగునట్లు ప్రార్థించండి.

**సికింద్రాబాద్:** నూతన ఇయు, ఇజియఫ్ కమిటీలు, ఇయర్ ప్లాన్‌ను బట్టి స్తుతించండి.

స్టూడెంట్స్ పరిచర్యలో చురుకుగా పాల్గొనునట్లు, ఇబియస్, బిబియస్, యంపిసిలు క్రమంగా జరుగునట్లు, సింగిల్ గ్రాడ్యుయేట్ల సెటిల్మెంట్ మరియు జాబ్స్ కొరకు ప్రార్థించండి.

**హెచ్‌సియు:** సెమిస్టర్ ఎగ్జామ్స్ రాస్తున్న స్టూడెంట్స్ కొరకు, రీసర్చ్ స్కాలర్స్ వర్క్, జరిగిన వర్చ్యువల్ క్రిస్మస్ ప్రోగ్రామ్, బైమంత్లీ మ్యాగజైన్ 'ఇన్ విజన్' 3వ ఇష్యూ కొరకు, 12 రోజులు వాట్సాప్ స్టేటస్‌లో గాస్పల్ షేరింగ్‌ను బట్టి స్తుతించండి.

క్రిస్మస్ ఫాలో అప్ ప్రోగ్రామ్, నెక్స్ట్ లైన్ లీడర్స్‌ను గుర్తించి ట్రయిన్ చేయుటకు, ఇబియస్ సెల్స్ తిరిగి ప్రారంభించునట్లు, స్టూడెంట్స్ క్రమంగా, చురుకుగా పరిచర్యలో పాల్గొనునట్లు, యంపిసిలు అర్థవంతంగా జరుగుటకు, న్యూ కాంటాక్ట్స్ కొరకు, ఫిబ్రవరిలో ప్లాన్ చేస్తున్న సైన్స్ టాక్, ఇతర విశ్వాసాల నుండి వచ్చిన

స్టూడెంట్స్ ఎదుర్కొంటున్న సమస్యల కొరకై ప్రార్థించండి.

**ఓయు:** బ్రదర్ సజ్జన్‌కు ఏపీ గ్రామ సచివాలయం జాబ్, సిస్టర్ మెర్సీ సుజాత కాటరాక్ట్ ఆపరేషన్ విజయవంతమైనందుకు, సిస్టర్ సుజాతకు నల్గొండలో వచ్చిన బి.ఎడ్ సీట్, క్రమంగా జరుగుచున్న బైబిల్ స్టడీస్, సిస్టర్ పావని వివాహమును బట్టి స్తుతించండి.

సిస్టర్ మెర్సి సుజాతకు పూర్తి రికవరీ, ఎఫెక్టివ్ బిబియస్, ఇబియస్ రీస్టార్ట్ అగుటకు, పీజీ స్టూడెంట్స్ ఎగ్జామ్స్ కొరకు, కౌన్సిలింగ్‌కు అటెండ్ అవుతున్న స్టూడెంట్స్ నిమిత్తం ప్రార్థించండి.

**అమీర్‌పేట:** ఆన్‌లైన్ క్రిస్మస్ ప్రోగ్రామ్స్ మరియు అటెండ్ అయిన స్టూడెంట్స్, జరుగుచున్న ఆన్‌లైన్ బైబిల్ స్టడీస్‌ను బట్టి స్తుతించండి.

బైబిల్ స్టడీస్ మరియు యంపిసిలు క్రమంగా, అర్థవంతంగా జరుగునట్లు, ఇయర్ ప్లాన్‌ను అనుసరించి పరిచర్య కొనసాగునట్లు ప్రార్థించండి.

**ఐడిపియల్:** జరిగిన ఫిజికల్ గాదరింగ్, ఆన్‌లైన్‌లో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్ బట్టి స్తుతించండి.

క్రిస్మస్ ప్రోగ్రామ్స్ ఫాలో అప్, స్టూడెంట్స్ ఎగ్జామ్స్, సిస్టర్ సౌజన్య ఆరోగ్యం నిమిత్తం ప్రార్థించండి.

**రామంతాపూర్:** క్రమంగా జరుగుచున్న ఇజియఫ్‌ను బట్టి స్తుతించండి.

విద్యార్థుల చొరవ కొరకు, బిబియస్ మరియు మెంటరింగ్ క్రమంగా జరుగునట్లు, గర్ల్స్ మినిస్ట్రీ కొరకు, సిస్టర్ జయ, బ్రదర్ చైతన్య హెల్త్, సింగిల్ గ్రాడ్యుయేట్ల వివాహాల నిమిత్తం ప్రార్థించండి.

**హయత్‌నగర్:** బ్రదర్ రంగారావ్ కుటుంబం కొరకు, బ్రదర్ గాబ్రియేల్ కుటుంబ ఆత్మీయ ఎదుగుదల, బ్రదర్ పాల్ పర్మనెంట్ జాబ్, చిల్డ్రన్ ఆరోగ్యం, సిస్టర్ సంధ్య ఆరోగ్యం, బ్రదర్ డేవిడ్ చర్చ్ మినిస్ట్రీ గ్రోత్, బ్రదర్ కోటేశ్వరరావ్ ఫుల్ శాలరీ, కుటుంబ ఆత్మీయ ఎదుగుదల, చిల్డ్రన్ స్టడీస్ నిమిత్తం ప్రార్థించండి.

**ఈస్ట్ తెలంగాణ**

**రీజినల్ కో-ఆర్డినేటర్:** సహో. వెంకన్న
**డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్:** నల్గొండ - సహో. సి.హెచ్. రాబర్ట్
మహబూబ్‌నగర్ - సహో. వెంకటస్వామి
**స్టాఫ్:**
నల్గొండ - సహో.యన్.శ్రీనివాస్ & సహోదరి ఉషా
**స్టాఫ్ కో-ఆర్డినేటర్:** సూర్యపేట - సహో.సుధాకర్
**గ్రాడ్యుయేట్ హెల్పర్:** సహో. జి. దేవేందర్, గద్వాల్

**కోదాడ:** సిస్టర్ హేమలత, బ్రదర్ కొండలరావ్ దంపతులకు దేవుడు అనుగ్రహించిన కుమారుని బట్టి, సిస్టర్ పావని వివాహం, జరిగిన 3 క్రిస్మస్ ప్రోగ్రామ్స్ బట్టి స్తుతించండి.

అప్‌కమింగ్ ప్రోగ్రామ్స్, బ్రదర్ రత్నాకర్ కుటుంబ సమస్యల కొరకు, సిస్టర్ కళ్యాణి కుటుంబ సమస్యల కొరకు, జోయల్, సన్నిల వివాహాల కొరకు, సిస్టర్ యశోద ఆరోగ్య సమస్యల నిమిత్తం ప్రార్థించండి.

**మిర్యాలగూడ:** క్రమంగా జరుగుచున్న బైబిల్ స్టడీస్‌ను బట్టి స్తుతించండి.

సిస్టర్ రుక్మిణి వివాహం, కెరీర్, బైబిల్ స్టడీస్‌కు అటెండ్ అవుతున్న స్టూడెంట్స్ ఆత్మీయ ఎదుగుదల నిమిత్తం ప్రార్థించండి.

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆



## ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు విజ్ఞప్తి

**ప్రతి నెల 15వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు editorvv2018@gmail.com కు పంపించగలరు.**

జనవరి నెలలో 'జాతీయ విద్యా విధానం 2020' శీర్షిక పై వివిధ ఆర్టికల్స్ ప్రచురించడానికి సహాయపడిన కెరీర్ గైడెన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ బ్రదర్ పరంజ్యోతి మరియు డిపార్ట్‌మెంట్ సభ్యులకు వివి ఎడిటోరియల్ బోర్డ్ కృతజ్ఞతలు తెలుపుచున్నది



# జీన్ పాంకివ్స్ట

- రూత్ వినయ్

యు.ఇ.యస్.ఐ పరిచర్య ప్రారంభ దినాలలో స్త్రీల మధ్య పరిచర్య అవసరాన్ని గమనించి, అనేకులు పట్టుదలతో ప్రార్థించారు. వీరి ప్రార్థనల ఫలితంగా 1962వ సం॥లో ప్రత్యేకంగా విద్యార్థినీల పరిచర్య కొరకు ప్రణాళిక రూపొందించబడింది. 1960-70 వరకు అప్పటి స్టాఫ్ సతీమణులు గర్ల్స్ పరిచర్యలో విరివిగా తమ సేవలందించారు. వారిలో ముఖ్యులు శ్రీమతి జోయాన్ స్కిల్ కార్న్, శ్రీమతి ఎల్లోయిస్ సెర్బెట్, శ్రీమతి డోరతీ చాందపిళ్ళ, శ్రీమతి శారమ్మ వర్గీస్, శ్రీమతి సిసిలియా పాల్ సత్కీర్తిరావు, శ్రీమతి (డాక్టర్) గార్లిక్, శ్రీమతి షిరిన్ తబిత ఇనాక్, శ్రీమతి షర్లీ స్కాట్, శ్రీమతి లియోనా గారిసన్ మొదలగువారు.

ఆ దినాలలో భారతదేశపు యువతులు లేడి స్టాఫ్‌గా వచ్చుటకు వారి కుటుంబాలలో అనుమతి అంత సులభంగా లభించేది కాదు. రెండు లేక మూడు సం॥రాలు పరిచర్య నిమిత్తం తమ కుమార్తెలను పంపితే, సరైన సమయంలో వారికి వివాహాలు జరగవని తల్లిదండ్రులు తలంచేవారు. కనుక ప్రారంభంలో కొందరు విదేశీ స్త్రీలు మన స్త్రీల పరిచర్యలో పాల్గొన్నారు.

## భారతదేశంలో జీన్

జీన్ కెనడాలోని ఐవిసిఎఫ్ సంస్థ తరపున విశాఖ పట్టణంలోని టింపోనీ స్కూల్ నందు టీచర్‌గా పనిచేయుటకు భారతదేశానికి వచ్చింది. ఆమె తుని మొదలగు ప్రదేశాలలో మిషనరీ పరిచర్యలో పాల్గొనేది. అప్పటికే యు.ఇ.యస్.ఐలో లేడి స్టాఫ్‌గా పనిచేస్తున్న మేరి బేటన్ ఆమెకు పరిచయమయ్యింది. వారిద్దరూ కలిసి నార్తన్ సర్కార్స్ (ఆంధ్ర ప్రదేశ్) జిల్లాలలో పరిచర్య చేసారు. తనను పోషిస్తున్న కెనడియన్ బాప్టిస్ట్ చర్చి అంగీకారంతో ఆమె 1965లో యు.ఇ.యస్.ఐలో స్టాఫ్‌గా చేరింది. "నీకు నీవే పరిచర్య చేయగలవనుకుంటే మాకు

నీ అవసరత లేదు. నీవు చేయలేనని తలంచినయెడల, నీవు దేవునిపై ఎక్కువగా ఆధారపడగలవు" అని బ్రదర్ చాందపిళ్ళ అమెకు సూచించారు.

**జీన్‌లోని ప్రత్యేకతలు**

మొదటిగా, జీన్ దేవునిని బహుగా ప్రేమించేది. దేవుని పిలుపుకు ప్రతిస్పందించి భారతదేశానికి మిషనరీగా వచ్చుటకు అదే ముఖ్యకారణం. రెండవది, జీన్ ప్రజలను ఎంతో ఆసక్తితో ప్రేమించింది. అందుకే ఆమె భారతదేశం లోని స్టూడెంట్స్ మధ్య పరిచర్య చేయడానికి తన జీవితాన్ని పెట్టుబడిగా పెట్టింది. ఆమెకు ఇక్కడ అనేకమంది స్నేహితులు ఉండేవారు. తరచూ వారిని దర్శిస్తూ సహవాసంలోని ఆత్మీయతను పంచేది. మూడవదిగా, జీన్ ఎంతో ఉత్సాహభరితంగా బైబిల్ పాఠాలను బోధించేది. పాత నిబంధన సర్వేని ఎంతో నేర్పుగా బోధించేది. నాల్గవదిగా, జీన్ పుస్తక పఠనాన్ని ప్రేమించేది. ఆమె సమకాలీన వేదాంత విద్యకు సంబంధించిన సమస్యలు, సవాళ్ళను గూర్చిన అధ్యయనం చేస్తుండేది. వాటి విషయాల్లో తన అభిప్రాయాలను ఎంతో ధైర్యంగా, విపులంగా వెల్లడిపరిచేది. చివరగా, జీన్ భారతదేశాన్ని, భారతీయులను నిజంగా ప్రేమించింది. ఆమె తన పదవీ విరమణ అనంతరం తన స్వదేశమైన కెనడాకు తిరిగి వెళ్లినప్పటికీ భారతదేశం గురించి, ఇక్కడ పరిచర్య గురించి తెలుసుకుంటూ అనేక మార్లు భారతదేశాన్ని తిరిగి దర్శించి, భారతీయ స్నేహితులతో మంచి సంబంధాలను కలిగి ఉండేది. జీన్ రిక్షావాలాలు, పండ్లు కూరగాయాలు అమ్మేవారితో కూడా ప్రత్యేక సంబంధాన్ని పెంచుకునేది. వారికి రక్షణ సువార్తను బోధించేది.

**జీన్ బోధనా నైపుణ్యతలు**

జీన్ తన బోధనా నైపుణ్యతతో అనేక విశ్వవిద్యాలయ విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసింది. **'ఒక క్రైస్తవుడికి ఉత్తమమైన ఆహారం బైబిల్ అని మరియు దానిలోని ఎక్కువ భాగాలను తినాలని'** జె.ఐ. ప్యాకర్ మాటలను ఆమె తరచూ ఉటంకించేవారు. ఆమె స్వయంగా దీన్ని చేసేవారు. ఇండక్టివ్ బైబిల్ స్టడీని ఎంతో సమర్థవంతంగా నిర్వహించేవారు. ఆమె స్పష్టమైన బోధనకు అసమానమైన తెలివి, హాస్యం మరియు మనోహరమైన చిరునవ్వును జతచేసేవారు. అప్పటి జూనియర్ స్టాఫ్‌కు, అనేకులకు రోల్ మోడల్‌గా ఉండేవారు. బైబిల్ స్టడీ కొరకు ఆమె వర్క్ బుక్‌లను రూపొందించుటలో కీలక పాత్ర పోషించారు. ఆమె తన స్నేహితులకు అనేక పుస్తకాలను చదవడానికి పరిచయం చేసేవారు.

**విద్యార్థి పరిచర్యలో జీన్ సేవలు**

1960–70 మధ్య కాలంలో వెపరీ, చెన్నైలోని వైడబ్ల్యుసిఎ (YWCA) హాస్టల్‌లో జీన్ నివసించేది. ఇతర లేడీ స్టాఫ్‌తో కలిసి దేశమంతటా పర్యటించి మహిళలను, విద్యార్థినీలను ప్రోత్సాహిస్తూ దేవుని వాక్య అధ్యయనం మరియు ప్రార్థనతో తమను తాము బలోపేతం చేసుకోడాన్ని ఎప్పుడు వదులు కోవద్దని ఆమె వారికి ఉపదేశించేది. ఆమె ఒక సమర్థవంతమైన నాయకురాలు. స్త్రీలను ఎంతో ప్రోత్సాహపరుస్తూ వారితో సన్నిహితంగా మెలిగేది. బిగ్గరగా మాట్లాడడంలో కొంచెం సమస్య ఉండేది. కాని ఆమె తన శక్తినంతా బోధనలో ఉపయోగించేది. ఇంగ్లీష్ సరిగా రానివారికి ప్రత్యేకంగా నేర్పించేది. అనేకమంది విద్యార్థినీల విజయాలు, పోరాటాలు, వైఫల్యాలలో ఆమె వారితో ఉండి వారిని ప్రార్థనతో, ఉపదేశాలతో బలపరచేది. ఆమె ఇతరులలోని సామర్థ్యాలను చూసి వాటని ఉపయోగంలోనికి తీసుకురావాలని హృదయపూర్వరంగా కోరుకునేది. కోటగిరికి వెళ్ళిన ప్రతివారికి ఆమె గుర్తుండిపోయేది.

జీన్ యు.ఇ.యస్.ఐలోని తన తోటి స్టాఫ్ బ్రదర్ చాందపిళ్ళ మరియు డాక్టర్ నార్టన్ స్టెరెట్‌లతో కలిసి బైబిల్ అధ్యయనాలను నిర్వహించేది. ఆమె మరియ వలె యేసు పాదాల వద్ద కూర్చొని అనేక విషయాలను నేర్చుకొనేది. తన పరిచర్య విషయంలో తాను తగినంతగా చేయలేదని, తాను చేయాల్సినవి ఇంకా చాలా ఉన్నవని ఎంతో వినయంతో చెప్పేవారు.

**పదవీ విరమణ తరువాత స్వదేశంలో జీన్**

భారతదేశంలో పరిచర్య నుండి పదవీ విరమణ పిమ్మట, జీన్ తన స్వదేశం కెనడాలోని రెజీనాలోని క్రైస్తవుల మధ్య పరిచర్యలో చివరి వరకు కొనసాగింది. స్త్రీలకు ప్రత్యేక బైబిల్ స్టడీలు, ప్రార్థనా గుంపులను నిర్వహిస్తూ వారిని బలపరిచేది. భారతదేశంలోని స్నేహితులను ఉత్తరాల ద్వారా ప్రోత్సహించేది. ఆమె తాను కలుసుకున్న ప్రతివారితో సువార్తను పంచుకునేది. అన్ని వయస్సుల వారితో కూడా సన్నిహితంగా మెలుగుతూ మార్గదర్శకురాలిగా వ్యవహరించేది.

**ముగింపు**

జీన్ జనవరి 5, 2013లో కెనడా దేశంలో రెజీనాలోని తన స్వగృహంలో మరణించింది. భారతదేశంలో మిషనరీగా 25 సం॥రాలు పరిచర్య చేసి అనేకమంది భారతీయ స్నేహితుల హృదయాలలో నిలిచిపోయింది. దేవునిపై ఆమెకు ఉన్న లోతైన విశ్వాసం, ఆయన పరిచర్యలోని ఆనందం, ఆమెకు జీవితాంతం వరకు గల ఉన్నతమైన ఉద్దేశాలు, యు.ఇ.యస్.ఐ పరిచర్యలో అనేకులను ప్రభావితం చేసిన మహిళగా జీన్ పాంక్విస్ట్ జీవితం అన్ని తరాల యువతీ యువకులకు, పూర్తికాల పరిచర్యలో ఉన్న స్టాఫ్ అందరికీ స్ఫూర్తి కాగలదని ఆశిస్తున్నాను ●

**(జీన్ మరణానంతరం భారతదేశ మిత్రులు ఆమెకు పంపిన సందేశాల సంపుటి ఆధారంగా ఈ వ్యాసం వ్రాయబడింది)**

**రూత్ వినయ్,** గర్ల్స్ మినిస్ట్రీ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ మరియు కూకట్ పల్లిలో గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

# ఇ.యు స్టూడెంట్ ఇన్ పాండమిక్



ఆ రోజు శుక్రవారం తేది. 20-3-2020. కొద్ది రోజుల్లో సెమిస్టర్ పరీక్షలు వస్తున్నాయి. ఎంచక్కా పరీక్షలు వ్రాసి ఇంటికి వెళ్ళొచ్చు అనుకుంటుండగానే, అప్పుడే అన్ని కళాశాలలు, యూనివర్సిటీలు విద్యార్థులకు సెలవులు ప్రకటిస్తున్నాయి. అందరూ ఇంట్లోనే ఉండాలంట. బయటకెళ్ళితే మాస్క్ ధరించాలంట. భౌతిక దూరం పాటించలంట. ఎప్పుడూ వినని కొత్త రూల్స్.

గతంలో ఎన్నడూ లేని విధంగా తరగతి గదులల్లో, పరీక్షలతో, స్నేహితులతో బిజీగా ఉండే విద్యార్థులందరు కోవిడ్ లాక్‌డౌన్ ద్వారా ఇంట్లోనే బంధీలయ్యారు. కుల, మత, జాతి, భాష, ప్రాంతం, వృతి, పేద, ధనిక తారతమ్యాలు లేకుండా కరోనా అందరినీ కలిచివేసింది. గర్విష్ఠుల గర్వమును అణిచివేసింది. అధికులను, అల్పులను ఏకస్థాయికి తెచ్చింది. గురి, గమ్యం లేకుండా, స్వపరిశీలనకు చోటివ్వక, పరమార్థం తెలియని జీవిత నావలో పయనించే ప్రపంచాన్ని, విద్యార్థి లోకాన్ని ఒక్కసారిగా ఆలోచింపచేసింది. ఒకవైపు బంధిస్తునే అపరిమిత స్వేచ్ఛనిచ్చింది. కరోనా కొందరిని విడదీసినా, ఎందరినో కలిపింది. అట్టడుగున చేరినా ప్రేమానురాగాలను వెలికితీసింది. నో టైం అన్న వారి నోరు మూయించింది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇది ఇ.యు పరిచర్యను సహితం ప్రభావితం చేసింది. ఎన్ని చేసిన కరోనా, విద్యార్థులనుండి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ని మాత్రం దూరం చేయలేదు. వాటి వినియోగం మరింత పెరిగింది. మనుష్యులు దూరమైన గాని, ఇంటర్నెట్ సేవలు, ఎలక్ట్రానిక్ పరికరాలు అడుగేయనంత అందుబాటులో ఉండి, అమూల్యమైన సమయాన్ని చేజిక్కించుకున్నాయి. దేవునితో ఆత్మీయంగా బలపడాలన్నా, సాతాను చేతిలో బలహీనుడై ఓడిపోవాలన్నా అవే సాధనాలుగా మారాయి.

ఇ.యు విద్యార్థిగా ఈ పాండమిక్‌లో మన సమయాన్ని ఎలా వినియోగించుకున్నావో ఒకసారి పరిశీలన చేసుకుందాం!

**ఇ.యు విద్యార్థిపై పాండమిక్ ప్రభావం, స్పందన. వాటిల్లో**

1. విద్యార్థి ఆధ్యాత్మిక జీవితం
2. విద్యార్థి చొరవ
3. విద్యార్థి చదువు

**1. విద్యార్థి ఆధ్యాత్మిక జీవితం**

వ్యక్తిగత జీవితాన్ని సరిచేసుకోవడానికి, ఆత్మీయంగా దేవునితో బలపడడానికి లాక్‌డౌన్ ఒక అద్భుత అవకాశం. కరోనా కారణాన ఆన్‌లైన్ వేదికగా అనేక సాంకేతిక మాధ్యమాలు (జూమ్, వెబెక్స్, గూగూల్ మీట్ మొదలగునవి..) అందుబాటులోకి వచ్చాయి. ఇ.యు విద్యార్థులు ఆన్‌లైన్ సహవాసం ద్వారా చాలా కార్యక్రమాలకు హాజరవ్వగలిగారు. క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లు, బిబియస్, ఇబియస్, యంపిసి, రిట్రీట్స్ మొదలగునవి... వ్యక్తిగత ప్రార్థనలో, సామూహిక ప్రార్థనలోనూ గడిపారు. ఆధ్యాత్మికంగా బలపరచబడ్డారు. వాక్యాన్ని ఎక్కువగా చదివారు, ధ్యానించారు. కార్యక్రమాలకైతే బాగానే స్పందించారు కాని, వ్యక్తిగత బలహీనతలు, వ్యసనాల నుండి విడిపింపబడలేక విడుదల, సమాధానం కొరకు పోరాడే విద్యార్థులు లేకపోలేదు. కుటుంబ, ఆర్థిక పరిస్థితులు, ఇంటి పనుల ఒత్తిడిలో పడి దేవునితో సహవాసాన్ని కోల్పోయిన విద్యార్థులు ఉన్నారు.

క్రీస్తు సారూప్యతలోనికి మార్చబడుటయే లక్ష్యంగా, నిరంతరం క్రైస్తవ సహవాసంలో కొనసాగుతూ, క్రీస్తు శిష్యులుగా సాగిపోదాం. కీర్తన 90:14లో మోషే ప్రార్థించినట్లుగా, ప్రతి ఉదయమున ఆయన కృపతో

తృప్తిపరచమని ప్రార్థిద్దాం. అప్పుడు మన దినములన్నియు ఉత్సహించి సంతోషించెదం.

**2.విద్యార్థి చొరవ**

మన విద్యార్థి పరిచర్య అభివృద్ధిలో విద్యార్థి చొరవ కీలకమైనది. కుటుంబ పరిస్థితులు అనుకూలించకనో, సాంకేతికపరమైన అసౌకర్యాలు వలనో, దేవునితో సహవాసం సరిగా లేనందువలనో కొంతమంది ఇ.యు విద్యార్థులు పరిచర్యలో పాల్గొనలేకపోయారు, చొరవ తీసుకొనలేకపోయారు. అయితే దేవునితో చక్కని సహవాసాన్ని అనుభవిస్తున్నవారు పరిశుద్ధాత్మ ప్రేరణతో ఆయన కలుగజేయు భారంతో పరిచర్యలో చురుకుగా పాల్గొన్నారు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నను పౌలు వలె నూతన ఒరవడులతో ప్రభువిచ్చిన దర్శనంతో, ప్రార్థనతో, పరిశుద్ధాత్మ నడిపింపుతో పరిచర్య చేసారు.

ఇ.యు పరిచర్యలో విద్యార్థి చొరవ

1. లాక్‌డౌన్ సమయంలో విద్యార్థులు వ్యక్తిగత సువార్త పరిచర్యలో ఎక్కువగా ఆసక్తి చూపి ఇతర విద్యార్థులను ప్రభువు దగ్గరకు చేర్చారు.
2. గ్రామాలలో తక్కువ మందితో చిన్న ఇబియస్ సెల్ ప్రారంభించారు.
3. డిజిటల్ మీటింగ్స్ కలిగియుండుటలో ప్రధాన పాత్ర పోషించారు.
4. వ్యక్తిగతంగా మొబైల్ కాల్స్ ద్వారా ఆధ్యాత్మికంగా, మానసికంగా ఇతర విద్యార్థులను బలపరిచారు. ఆన్‌లైన్ వేదికగా ప్రతి ఉదయం ప్రార్థనా సమావేశాలను కొనసాగించారు. ఇంకా ఎన్నెన్నో...

అయితే చాలామంది విద్యార్థులు సాతాను శోధనలకు తలొగ్గి వ్యక్తిగత జీవితంలో ఓడిపోయి పరిచర్యలో చురుకుగా పాల్గొనలేకపోయారు. ఇలాంటి విద్యార్థులకు కావాల్సింది ఆత్మీయ పలకరింపు మాత్రమే కాదు, తనను అర్థం చేసికొని, తన పరిస్థితిని అంగీకరించి, వెన్నుండి నడిపించే ఆత్మీయ నాయకుని సహకారం ఎంతో అవసరం. ఇప్పటికీ ఇ.యు విద్యార్థులు ఆశిస్తున్నట్లుగా పరిచర్యలో చొరవ తీసుకోకపోవడానికి కారణం తనను అర్థం చేసుకొని నడిపించేవారు తక్కువయ్యారనే చెప్పాలి.

**"ప్రస్తుత కాలంలో చాలా ఆత్మీయ మెంటార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి."**

ఈ పోస్టులు ధరఖాస్తుల స్వీకరణకై ఎదురుచూస్తున్నాయి. "అందరును తమ సొంత కార్యములనే చూచుకొనుచున్నారు గాని, యేసు క్రీస్తు కార్యములను చూడరు" (ఫిలిప్పీ 2:21). మనుష్యులను సంతోషపెట్టుటకంటే, దేవుని మహిమ పరచాలనే దృక్పథం కలిగి, ఆయనతో చక్కని సహవాసాన్ని అనుభవిస్తూ ఆయన మనలను నమ్మి ఇచ్చిన పరిచర్యలో విద్యార్థులు చొరవ తీసుకొనుటకు సిద్ధపరచుదాం.

**3.విద్యార్థి చదువు**

పరీక్షలు సమీపిస్తున్న సమయంలో కరోనా వచ్చి విద్యార్థులను తాత్కాలికంగా ఒత్తిడి నుండి విడిపించినప్పటికీ, లాక్‌డౌన్ తర్వాత ప్రతికూల సమాయాల్లో పరీక్షలు నిర్వహించడం ద్వారా సతమతమయ్యారు. ఇదివరకు ఎన్నడూ లేని ఆన్‌లైన్ బోధనా విధానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాల్సి వచ్చింది. ఒకవైపు ఉద్యోగులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ద్వారా ఉత్పత్తిని పెంచుతుంటే, విద్యార్థులకు 'స్టడీ ఫ్రమ్ హోమ్' ద్వారా నాణ్యమైన విద్య అందటంలేదు. విద్యార్థులు గంటల తరబడి మొబైల్/ల్యాప్‌ట్యాప్ వాడడం ద్వారా తగినంత దృష్టి పెట్టలేకపోతున్నారు. పైగా అలసిపోతున్నారు. మొబైల్స్/ల్యాప్‌ట్యాప్ రేడియేషన్ విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. కావున ఈ సమయంలో చదువులో, కళాశాలలో సాక్ష్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇ.యు విద్యార్థిపై ఉందని మరచిపోవద్దు. మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న విద్యార్థులు నెట్‌వర్క్ సిగ్నల్స్ లేక సాంకేతిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అన్నీ ఉన్నా ఇంటి సమస్యలతో మానసిక ఇత్తిడికి గురై చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారు. అలాంటి వారిని గుర్తించి, చేయూతనిచ్చి, ప్రోత్సహిద్దాం. అప్పుడు వారు చదువుల్లోను, పరిచర్యలోను రాణించగలరు.

మన దేశంలో 2020 సం॥లో డిగ్రీ పూర్తి చేసుకున్నవారు సుమారు 3.66 కోట్లమంది (వికిపీడియా) ఉన్నారు. సుమారు 10 కోట్ల మంది కరోనా కారణాన ఉద్యోగాలు కోల్పోయి తిరిగి ఉద్యోగాలు తెచ్చుకొనుటకు పాటు పడుతున్నారు. 2020 సం॥లో డిగ్రీ పూర్తి చేసుకున్న ఇ.యు విద్యార్థులు ఈ పోటీ ప్రపంచానికి తగినట్టుగా సిద్ధపడాలి. చాలా మంది ఆర్థిక అవసరాలలో ఉండి, కుటుంబానికి సహాయం చేస్తూ ఉద్యోగ సిద్ధపాటుకు, పరీక్షల సిద్ధపాటుకు తగిన సమయాన్ని వెచ్చించలేకపోతున్నారు. ఉద్యోగాల కొరకు ఎదురుచూస్తున్నారు. అవకాశంగా వచ్చిన చిన్న చిన్న ఉద్యోగల్లో చేరి తమ లక్ష్యాలను మరచి పోతున్నారు. వారికి ప్రోత్సాహం, ఆదరణ, మార్గనిర్దేశం కావాలి.

"వేచి ఉండటం వృథా కాదు" అన్నారు అనుభవజ్ఞులు. సహనంతో, క్రమశిక్షణతో దేవునిపై ఆధారపడుతూ సరియైన సమయపాలనతో ప్రయత్నిస్తే దేవుడు తన సొంత సమయంలో ఆయన చిత్తానుసారంగా ఉత్తమమైన దానిని అనుగ్రహిస్తాడు (కీర్తన 85:12, 32:8).

**ముగింపు**

కడవరి దినములలో ఉన్న మనం పౌలు ఎఫెసీయులకు వ్రాసిన మాటను జ్ఞాపకం చేసుకుందాం. "దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక జ్ఞానులవలె నడుచు కొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసి 5:15).

దర్శనం కలిగిన ఇ.యు విద్యార్థులుగా ప్రభువిచ్చిన పరిచర్యలో చొరవ తీసుకొని చురుకుగా పనిచేద్దాం. ఇ.యు విద్యార్థులు మానసిక, ఆర్థిక, ఆధ్యాత్మిక సహకారం కోసం ఎదురుచూస్తున్నారు. వారిని అర్థం చేసుకున్నవారిగా, మన పితరులు మనపై చూపిన శ్రద్ధను, నిష్కపటమైన ప్రేమను మన విద్యార్థులపై కనపరచుదాం●

**డానియేల్, నిట్ వరంగల్‌లో గ్రాడ్యుయేటన్ చేసారు. ప్రస్తుతం కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సిద్ధపడుతున్నారు.**



నా పేరు విజయ. మా ఊరు పెద్దాపురు, నాంపల్లి మండలం. మా తల్లిదండ్రులకు మేము ఇద్దరు కుమార్తెలం. నేను చిన్నదాన్ని. చిన్నప్పటినుండి మా తల్లిదండ్రులు మమ్మలను బాగా చూసుకొనేవారు. ప్రాముఖ్యంగా మా నాన్న గారు మమ్ములనెంతో బాగా ప్రేమించేవారు. మా కోసం చాలా కష్టపడేవారు. ఎన్నో సమస్యల కోర్చి మా అక్క వివాహం చేసారు. ఆ తరువాత మాకు చాలా సమస్యలు వచ్చాయి. అప్పటి వరకు జీవిత ఉద్దేశం గురించి ఆలోచించని నేను చాలా బాధపడ్డాను. ఎన్నో దేవుళ్ళకు మ్రొక్కాను. కాని పరిస్థితి ఏం మారలేదు. ఏంతో ఏడ్చాను.

ఆ సమయంలో మా ఊరిలోని జయగీత మేడం ఇంటికి వెళ్ళేదాన్ని. మేడం నా కోసం ప్రార్థన చేస్తున్నానని చెప్పేవారు. నన్ను కూడా ప్రార్థన చేసుకోమనేవారు. కొన్ని రోజుల తరువాత నన్ను ఇ-క్యాంప్‌కు తీసుకువెళ్ళారు. ఆ క్యాంపులో దేవుని లక్షణాలను తెలుసుకున్నాను. ఆ లక్షణాలను బట్టి యేసు ప్రభువే నిజమైన దేవుడని నమ్మాను. అంతేకాకుండా, లూకా 15వ అధ్యాయంలో నుండి వాక్యం చెప్పినప్పుడు తప్పిపోయిన కుమారుని లాగా నేను కూడా తప్పిపోయానని గ్రహించాను. దేవుని యెదుట నా నిజ స్థితిని ఒప్పుకొని ఆగష్టు 8, 2013న యేసు ప్రభువును నా స్వంత రక్షకునిగా అంగీకరించాను. నేను భౌతిక రక్షణ గురించే ఆలోచించాను గాని దేవుడు మాత్రం నా ఆత్మకు కూడా రక్షణను ఇచ్చారు. తరువాత నా పట్ల దేవుని ఉద్దేశాలు అర్థమయ్యాయి.

మా ఊరిలో జరిగే బైబిల్ స్టడీస్‌కు క్రమంగా వెళ్ళడం మొదలు పెట్టాను. మా ఊరికి స్టాఫ్, గ్రాడ్యుయేట్స్, స్టూడెంట్స్ వచ్చినప్పుడు వాళ్ళ సాక్ష్యంతో పాటు దేవుని విషయాలను పంచుకొనేవారు. డిగ్రీలో చేరినప్పుడు బైబిల్ స్టడీస్‌కు వెళ్ళేదాన్ని కాని మా ఇంటి దగ్గర పనులను బట్టి హాస్టల్‌లో కంటే ఎక్కువ ఇంటి దగ్గరే ఉండేదాన్ని. వాక్యాన్ని విన్నప్పటికీ పరిచర్యలో ఎక్కువ పాల్గొనలేదు. నాకేం తెలియకున్నా నా జూనియర్స్ నన్ను అక్క వాళ్ళ ఇంటికి తీసుకొని వెళ్ళేవాళ్ళు.

మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో పీజీ చేరిన తరువాత అక్క వాళ్ళ ప్రోత్సాహంతో నేను కూడా ఇతరులతో వాక్యాన్ని పంచుకోవచ్చని అర్థమయింది. పరిచర్య పట్ల నా బాధ్యతను గ్రహించాను. ముందుగా నా ఫ్రెండ్స్‌కు దేవుని ప్రేమను గూర్చి చెప్పి వారిని బైబిల్ స్టడీస్‌కు ఆహ్వానించాను. నా సాక్ష్యంతో పాటు దేవుడు నాతో మాట్లాడిన విషయాలు వారితో పంచుకొన్నాను. మా హాస్టల్‌లో ఒక చిన్న ప్రార్థనా గుంపును మొదలు పెట్టడానికి దేవుడు సహాయం చేసారు. మహబూబ్‌నగర్‌లో ఇతర గర్ల్స్ హాస్టల్స్‌కు వెళ్ళి అక్కడ విద్యార్థినీలను ప్రోత్సహించి, వారిని బైబిల్ స్టడీస్‌కు తీసుకురావడానికి, అలాగే ఐసిఇయు కమిటీలో వివిధ బాధ్యతలను నిర్వహించడానికి ప్రభువు ఎంతో కృప చూపించారు. బలహీనురాలిని, మితభాషిని అయిన నన్ను దేవుడు ఆయన పరిచర్యలో ఓ పాత్రగా వాడుకున్నందుకు దేవునికి స్తోత్రములు.

వ్యక్తిగతంగా, నేను నా సమస్యల గురించి బాధపడిన ప్రతి సమయం, ప్రతి క్షణం దేవుడు నన్ను చక్కగా నడిపించారు. సమస్యల గురించి దేవుని దగ్గర ప్రార్థన చేసినప్పుడు ప్రతిదానికి సమాధానం ఇచ్చారు. నిజానికి మా నాన్న గారికి బ్లడ్ ఇన్‌ఫెక్షన్ సోకడం వల్ల ఎప్పుడో చనిపోవాల్సింది, కాని దేవుని మహా కృపను బట్టి ఆయన ఇంకా క్షేమంగా ఉన్నారు. నా జీవితంలో, చాలా సార్లు నా వల్ల కాదు, నేను చెయ్యలేనని 99% చేతులు ఎత్తివేసినప్పుడు వెంటనే నా దేవుడు ధైర్యాన్ని నింపాడు. దేవుని స్వరం, ఆయన బలాన్ని బట్టి మాత్రమే నేను జీవించ గలుగుతున్నాను.

**- జి.విజయ**


**స్తుతి అంశాలు**

1. నా చదువు పూర్తి చేసుకోవడానికి దేవుడు సహాయం చేసిన దాన్ని బట్టి
2. మా నాన్నగారికి దేవుడనుగ్రహించిన క్షేమాన్ని బట్టి
3. మేము ఇల్లు కట్టుకోవడానికి దేవుడు సహాయం చేసారు

**ప్రార్థనాంశాలు**

1. పాలమూరు యూనివర్సిటీ పరిచర్య కొరకు
2. మా నాన్నగారి ఆరోగ్యం కొరకు (బ్లడ్ ఇన్‌ఫెక్షన్)
3. మా అక్క కుటుంబ రక్షణ కొరకు
4. ఉద్యోగం, సెటిల్మెంట్ కొరకు

**విజయ, ఎమ్మెస్సీ, బి.ఎడ్ పూర్తి చేసారు. ప్రస్తుతం కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సిద్ధపడుతున్నారు**






| | |
|---|---|
| Title | : Christian Leadership |
| Author | : Graham Houghton |
| Number of pages | : 250 |
| Language | : English |
| Publisher | : SAIACS Press |
| Year of Publication | : 2014 |
| Price | : 275/- |

**- RAJESH DASARI**

This is an excellent book on Christian Leadership. This book is very interesting till the end. I promise you that you will never feel bored during the journey of reading. The author, Dr. Graham Houghton inspires us to be true Christian leaders. He explains what is Christian Leadership and also presents several definitions on leadership in the beginning of his book. He includes the essential contents of Christian Leadership with biblical emphasis on servant leadership. Dr. Houghton's style of simplicity, his enthusiasm to learn and share from the wisdom of others is note worthy. The book reflects author's many years of personal experience in the ministry. All this experience serves to illustrate those elements of cheerful humility and resourceful dedication that characterize the biblical style of leadership.

The author is a greatly respected leader of international stature, has written with integrity, the principles and values which he has consistently practiced. The author motivates an honest reader for the true Christin Leadership. This book is a must read for emerging and experienced leaders. The author has skilfully interwoven both the theories and workable practices. The principles of this book emerged from over 40 years of his experience as a missionary, teacher and founder Principal of SAIACS. This manual for leadership is applicable to all audiences across the world as the author has insights into multiple cultures and situations •

**Rajesh Dasari, State Secretary (Designate), UESI-TS, Hyderabad**





# యరొబాము

యరొబాము అనే పదానికి 'ప్రజలను విస్తరింప జేయువాడు' అని హెబ్రు భాషలో అర్థం.

**పరిచయం**

యరొబాము, ఇశ్రాయేలు ఉత్తర రాజ్యంలోని 10 గోత్రాలకు మొట్ట మొదటి రాజు. ఇతడు జెదా సంబంధమైన ఎఫ్రాయిమీయుడైన 'నెబాతు' కుమారుడు. తల్లి పేరు జెరూహా. ఆమె విధవరాలు. ఇతడు మహాబలాఢ్యుడైన యౌవనుడు. ఇతనిని సొలొమోను పరిపాలన కాలంలో యోసేపు సంతతివారు చేయవలసిన భారమైన పని మీద అధికారిగా నియమించబడినవాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. మొదటివాడు అభియ, రెండవవాడు నాదాబు. ఇతడు అహీయా ప్రవక్త ద్వారా యెహోవా దేవుడు మాట్లాడి ఒక సేవకుని నుండి రాజ్యాన్ని పరిపాలించే రాజుగా ఎన్నుకోబడునని ప్రవచించాడు (1 రాజు 11:33). సొలొమోను మరణం తర్వాత రెహబాము రాజ్యపాలనలో ఇతడు ఇశ్రాయేలు ఉత్తర రాజ్యానికి రాజుగా పట్టాభిషేకమం చేయబడి క్రీ.పూ 931-909 సం॥ వరకు అంటే 22 సం॥ పరిపాలించాడు (1 రాజు 12:20).

**పరిపాలన**

సొలొమోను మహారాజు దేవుని దృష్టికి యోగ్యమైనవి చేయక ఆయన కట్టడలను నేరవేర్చక (చివరి దినాలలో) ఆయన చేతిలో నుండి రాజ్యాన్ని కొట్టివేసి ఇశ్రాయేలీయుల 10 గోత్రాలను పరిపాలించుటకు నీకు ఇచ్చెదనని అహీయా ప్రవక్త ద్వారా యరొబాముతో దేవుడు మాట్లాడి ఏర్పర్చుకోగా,

> **“ మన జీవితాన్ని చూచి ఇతరులు దేవునికి దగ్గరగా జీవించేటట్లు మాదిరితో కూడిన వారసత్వాన్ని మనం అందించాలి.**

సొలొమోను తర్వాత తన సంతతి నుండి కాక వేరొకరు రాజ్యాన్ని పరిపాలించెదరు అని తెలిసి యరొబామును చంపుటకు పూనుకొనగా యరొబాము ఐగుప్తు పారిపోయి రాజైన షీషకు నొద్ద ఉండి, సొలొమోను మరణం తర్వాత తన కుమారుడు రెహబాము రాజైనప్పుడు, యరొబాము తిరిగి ఇశ్రాయేలు దేశమునకు తిరిగి వచ్చాడు. అయితే ప్రజలు, రెహబాము చేష్టల వలన విసికి ఆయనకు వేరుగా 10 గోత్రాలకు యరొబామును రాజుగా పట్టాభిషేకం చేసారు (1 రాజు 12:20).

యరొబాము రాజైన తర్వాత ఎఫ్రాయిము మన్యమందు షెకెము, పెనూయేలు అనే పురములను కట్టించెను. ఇతని పరిపాలనలో ఇశ్రాయేలు ప్రజలు బలులు అర్పించుటకు యెరుషలేము మందిరముకు వెళ్ళగా రాజైన యరొబాము తన స్వార్థమైన ఆలోచన వలన ఇశ్రాయేలీయులు తిరిగి రెహబాము తట్టు తిరుగుదురేమోనని, తిరిగి రాజ్యం దావీదు సంతతిదవుతుందని తన హృదయమందు ఆలోచించి, ఇశ్రాయేలీయులారా ఐగుప్తు నుండి మిమ్మును రప్పించిన మీ దేవుడు ఇవే అని చెప్పి రెండు బంగారపు దూడలను చేయించి, వాటిని ఒకటి దాను నందు, రెండవది బేతేలునందు ఏర్పరచెను (1 రాజు 12:29–30). వాటికి బలులు అర్పించుచు ఇశ్రాయేలీయులను విగ్రహారాధన వైపు నడిపించి పాపం చేయుటకు రాజు కారణమైనప్పుడు ఇతనిని దేవుడు మొత్తినందున మరణించెను. ఇతని తర్వాత అతని కుమారుడైన ‘నాదాబు’ రాజాయెను (1 రాజు 12:30, 2 దిన 13:20).

**బలాలు**

1. యరొబాము సొలొమోను కాలమందు ఒక సేవకునిగా నమ్మకంగా జీవించుట వలన, విధేయత కలిగి ఉండుట చేత దేవుడు ఒక అధికారిగా, రాజుగా 10 గోత్రాలను పరిపాలించే మొట్ట మొదటి రాజుగా అతనిని దేవుడు ఎన్నుకున్నాడు.
2. రెహబాము రాజు యరొబాముతో యుద్ధం చేయుటకు పూనుకొనగా, ఇతడు నమ్మకంగా ఉండుట చేత ఇశ్రాయేలీయుల ప్రజలకు దైవజనుడగు షెమయాకు ప్రత్యక్షమై యుద్ధం చేయుటకు వెళ్ళక మీ మీ ఇండ్లకు తిరిగి వెళ్ళుడని చెప్పినప్పుడు దేవుని మాటకు ప్రజలు విధేయులై యుద్ధమునకు వెళ్ళలేదు.
3. దేవుని చేత అహీయా ప్రవక్త ద్వారా ప్రవచనాత్మకంగా ఎన్నుకొనబడిన రాజు.

**బలహీనతలు**

1. తన సొంత స్వార్థపూరితమైన ఆలోచన విధానం, ఇశ్రాయేలీయులు, విగ్రహారాధన వైపు పడిపించుటకు కారణమైంది (1 రాజు 12:30)
2. యూదా దేశమందు జరుగు ఉత్సవం జరుప నిర్ణయించి, బలిపీఠం మీద బలులు అర్పించి, తానే ధూపం వేయుటకు బలిపీఠమెక్కెను (1 రాజు 12:33).
3. యరొబాము దైవజనుని మాట ధిక్కరించుట వలన దేవుని కోపాన్ని చవిచూసినా తనలో మార్పురాలేదు (1 రాజులు 13:4–6)
4. యరొబాము తన దుర్మార్గమును విడిచిపెట్టక సామాన్య జనులలో కొందరిని, యాజకులుగా నియమించెను. తన సొంత ఆలోచనా విధానంతో పరిపాలన చేస్తూ దేవుని చిత్తాన్ని విడిచెను. దీని వలన తన సంతతి నిర్మూలమగుటకు అతని పాపం కారణమయ్యెను (1 రాజు 13:33, 2 దిన 11:15).
5. ఇశ్రాయేలువారు దేవతా స్తంభములను నిలిపి యెహోవాకు కోపం పుట్టించుట వలన, యెహోవా వారిని మొత్తి చెదరగొట్టుటకు రాజు కారణమయ్యెను.
6. రెహబాము కుమారుడు అబీయాకును, యరొబాముకును యెడతెగక యుద్ధం జరిగినందున ఇతడు మరల బలం పొందలేదు. యెహోవా అతనిని మొత్తినందుచేత మరణమొందెను (2 దిన 13:20).

**నేర్చుకోవలసిన పాఠాలు**

1. దేవునికి విధేయత కలిగి జీవించినప్పుడు తగిన సమయంలో ఆయన మనలను హెచ్చించి స్థిరపరచును. మనలను ఏ స్థితినుండి రక్షించుకొన్నాడో దానిని మరువకూడదు.
2. మన పూర్వ స్థితిని మరవక దేవుడు మనకిచ్చిన ఉద్యోగం, హోదా, స్థాయిని బట్టి గర్వింపక, స్వార్థంగా ఆలోచించక ఆయన చిత్తాన్ని నెరవేర్చుటకు సిద్ధంగా ఉండి కృతజ్ఞతగా జీవించాలి. యరొబామును రాజుగా చేసినప్పుడు సొంత ఆలోచన ద్వారా ప్రజలు పాపం చేయుటకు కారణమయ్యెను.
3. దేవుడు మనలను హెచ్చరించినప్పుడు, మనలను మనం సరిచేసుకొని, ఆయనకు వ్యతిరేకంగా జీవించక, మనకు అప్పగించిన పనిని, బాధ్యతలను తర్వాత తరాలకు అందించేటట్లు మాదిరిగా జీవించాలి.
4. వాక్యానికి విధేయత చూపకపోతే మన స్వార్థం మనలను పాలించి అవిధేయులుగా చేసి మనలను నశింపజేయును (1 రాజు 13:34).
5. వాక్యం స్థిరమైనది గనుక దానిని అనుసరించి జీవించుట వల్ల దేవునిపై విశ్వాసాన్ని పెంపొందించుకొని సొంత ఆలోచనలకు చోటివ్వకుండా కాపాడుతుంది.
6. మన జీవితాన్ని చూచి ఇతరులు దేవునికి దగ్గరగా జీవించేటట్లు మాదిరితో కూడిన వారసత్వాన్ని మనం అందించాలి ●

**ఆర్. వినయ్, టీచర్, కామారెడ్డి మరియు వెస్ట్ తెలంగాణ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా ఉంటున్నారు**



కథానిక

# ఆత్మ ఫలం

**– శ్యామలా కృపారావు**

సిటీ ఔట్‌కట్స్‌లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజ్‌లో చదువుతున్న స్పందన, ఎప్పటిలాగానే బస్సులో కాలేజికి బయలు దేరింది తన ప్రయాణం దాదాపు గంటకు పైగా ఉన్న కూడా. బస్సు కిటికీలో నుండి కనిపిస్తున్న పచ్చని పంటలను, పండ్ల తోటలను చూస్తూ, చెట్ల నుండి వచ్చే చల్లటి గాలికి సేదదీరుతూ, దేవుని సృష్టిని బట్టి మౌనంగా ఆయనను స్తుతించడం అలవాటయిపోయింది. కాబట్టి తనకు ప్రయాణం అస్సలు బోరనిపించదు.

ఎప్పటిలాగానే ప్రయాణిస్తున్న తనకు దూరంగా కనిపించిన దృశ్యం ఆలోచింప చేస్తూ ఉంది. పనివాళ్ళు ద్రాక్ష తీగల నుండి చాలా జాగ్రత్తగా ద్రాక్ష గెలలను తెంపుతున్నారు. ప్రక్కనే యజమాని ద్రాక్ష తీగలనూ, వాటి గెలలను పరీక్షిస్తూ వెళ్తున్నాడు. పొలాల దృష్టాంతం ద్వారా దేవుడిచ్చిన గంభీర సందేశాలు గుర్తుకు వస్తున్నాయి స్పందనకు. ఫలించాలంటే ముందుగా చనిపోవాలి. గోధుమ గింజ భూమిలో పడి చనిపోతేనే ఫలిస్తుంది. అంటే ఫలించాలంటే చీకటిలోనూ, ఒంటరితనంలోనూ పాతిపెట్టబడాలి అన్నమాట. ఆమ్మో! ఆ మాటలు తలంచుకుంటేనే భయమేస్తుంది అనుకుంది. "నిన్నటికి నిన్న బిబియస్‌లో అక్క చెప్పిన మాటలు హఠాత్తుగా గుర్తుకు వచ్చాయి. మీరు బహుగా ఫలిస్తేనే నా తండ్రి మహిమ పరచబడతాడు. ఇందువలనే నాకు శిష్యులు అవుతారు. అంటే ఫలించకపోతే దేవుని శిష్యులం అవ్వలేమా? ఏమో? ఫలించే తీగ మరెక్కువగా ఫలించాలని ఆయన పనికిరాని తీగలను తీసివేయును. అంటే నాలో పనికిరానివి ఏమున్నాయి?

ఫ్రెండ్స్, సోషల్ మీడియా. దేవునికి ప్రథమ స్థానం ఇవ్వలేని తనకు ఇవ్వన్ని లోపల ఎవ్వరో గుర్తుచేస్తునట్లుంది. కాదని తప్పుకొనే ఆస్కారం లేదన్నట్టు ఋజువులతో సహా గుర్తుకు వస్తున్నాయి. ఫ్రెండ్స్‌ను అసలు వదులుకోలేను. ఎందుకంటే, వాళ్ళు విశ్వాసులు కాకపోయినా ఎంతో మంచివారు. వారు చూసిన సినిమాలు, బట్టలు, క్రొత్త ఫ్యాషన్‌ల గురించి మాట్లాడుతారు. ఇంకా అబ్బాయిల గురించి

మాట్లాడుతారు. కొన్నిసార్లు అబ్బాయిలకు వినిపించేలా కామెంట్లు కూడా చేస్తారు. స్టూడెంట్స్ కాకపోతే ఇంకెవ్వరు చేస్తారు? అసలు మనిషన్నాక కాస్త 'థ్రిల్' అనేది ఉండాలి కదా? మనం చేసే పనులు ఎవరికీ హానికరం కానప్పుడు వాటిని ఎందుకు మానుకోవాలి? నేను ఆ గ్రూపులో ఉన్నా పెదవి విప్పను కదా? మళ్ళీ... లోపల ఎవ్వరో గుర్తు చేస్తున్నారు

"దుష్టుల ఆలోచన చొప్పున నడవక, పాపుల మార్గమున నిలువక, అపహాసకులు కూర్చుండు చోట కూర్చుండక...

ఇలా ఒక దాని వెంట ఒకటి గుర్తుకొస్తున్నాయి...

శరీర క్రియలకు వ్యతిరేకంగా 'ఆత్మఫలం' అని పిలువబడే ఏకీకృత జీవన విధానం ఉంది. ఇది దేవుని పిల్లలు పాపపు శక్తిని ముఖ్యంగా శరీర క్రియలను నశింపచేయగలిగేలా, దేవుని సహవాసంలో నడిచేలా చేయడానికి, ఆత్మ చేత తమ జీవితాలను నడిపించడానికి, ప్రభావితం చేయడానికి అనుమతించే కొలది వారిలో ఉద్భవిస్తుంది (1 పేతురు 1:4-9, రోమా 8:5). "దేవుని ఆత్మ చేత ఎందరు నడిపింపబడుదురో వారందరూ దేవుని కుమారులైయుందరు" (రోమా 8:14). నిన్న బైబిల్ స్టడీలో అక్క చెప్పిన విషయాలు గుర్తుకు వస్తున్నాయి స్పందనకు... కాదు ఎవరో గుర్తుచేస్తున్నట్లు ఉంది తనకు. ఇంతకూ ఆత్మ ఫలమేమిటి? తనకు తానే ప్రశ్నించుకుంది స్పందన. మెల్లనైన స్వరముతో ఎవరో బోధిస్తున్నారు...

**ప్రేమ:** ఇతరుల కొరకు అతి శ్రేష్ఠమైన దానిని కోరుకోవడం, దాని కోసం పనిచేయడం (ఎఫెసీ 5:2).

**సంతోషం:** క్రీస్తులో విశ్వాసముంచిన వారికి లభించే కృప, ఆశీర్వాదాలు, వాగ్దానాలు, దేవునితో సానిహిత్యం మొదలగు వాటి వల్ల కలిగే ఆనందం (కీర్తన 119:6).

**సమాధానం:** మనకు, పరలోక తండ్రికి మధ్య అంతా సామరస్యం గానే ఉందన్న అవగాహన...నెమ్మది... ప్రశాంతత (రోమా 15:33).

**దీర్ఘశాంతం:** భరించడం, సహనం వహించడం, నిస్పృహ చెందక పోవడం (ఎఫెసీ 4:3).

**దయాళుత్వం:** ఇతరులను బాధపరచకపోవడం, నొప్పించకపోవడం (ఎఫెసీ 4:32).

**మంచితనం:** సత్యం, నీతి విషయాల్లో రోషం కలిగి, దుష్టత్వం పట్ల ద్వేషం కలిగి ఉండడం (లూకా 7:37-50).

**విశ్వాసం:** మన సమర్పణ, విశ్వాసం ఎవరిపైనా ఉంచామో ఆ దేవుని పట్ల సంపూర్ణమైన నమ్మకత్వాన్ని, చలించని భక్తిని కలిగి ఉండడం (రోమా 3:3).

**సాత్వీకం:** బలం, ధైర్యంతో కూడిన నిగ్రహం. కోపం చూపించవలసిన సమయంలో కోపం చూపించడం, తగ్గించుకొని లోబడి ఉండవలసిన సమయంలో తగ్గించుకోగలగడం ( 1 పేతురు 3:15).

**ఆశానిగ్రహం:** కోరికలను, అనుభూతులను అదుపులో ఉంచుకోగలిగిన సామర్థ్యం... సచ్ఛీలత, పవిత్రత కూడా ఇమిడి ఉన్నాయి (1 కొరింథీ 9:25).

ఇలాంటి లక్షణాలు ఉన్న జీవిత విధానానికి హద్దులంటూ ఏమి లేవు. పాటిస్తూనే... నేర్చుకుంటూ ఉండవచ్చు. ఈ సుగుణాలను మళ్ళీ మళ్ళీ... ఆచరణలో పెడుతూ ఉండాలి.

నిన్న బైబిల్ స్టడీలో అక్క చెప్పిన విషయాలను గుర్తుకు తేవడమే గాక... మరింత లోతుగా అవగాహన చేసుకోవడానికి ఆత్మ దేవుడు సహాయం చేసాడనిపించింది స్పందనకు.

తన ఫ్రెండ్స్... క్లాస్‌మేట్స్ చేస్తున్న అల్లరికి గాని, అబ్బాయిలపై విసురుతున్న కామెంట్స్‌కు గాని స్పందించ లేదు స్పందన హృదయం. తన చుట్టూ ఎన్నో రణగొణ ధ్వనులు ఉన్న ప్రభువిచ్చిన ప్రశాంతతను అనుభవిస్తున్నట్లు అనిపించింది స్పందనకు.

డిటి క్యాంపుకు వెళ్ళినంత మాత్రాన శిష్యులమవ్వలేం. మనం బాగా ఫలించినప్పుడు మాత్రమే ఆయనకు శిష్యులమవుతామని అక్క నిన్న చెప్పినప్పుడు, ఇన్నాళ్ళు నా మనస్సులో ఉన్న భావన ఇదేగా! అనిపించి నవ్వుకున్న విషయం గుర్తొచింది స్పందనకు.

ఇలా ఆలోచిస్తున్న స్పందనకు... ఏంటి దిగవా? అని తన క్లాస్‌మేట్ పిలిచేసరికి, ఆ... అంటూ లేచి వారి వెనకాలే దిగి "మీరు బహుగా ఫలియించినచో..." అని తను డిటి క్యాంపులో నేర్చుకున్న పాటను మౌనంగా పాడుకుంటూ తన ముందు నడిచి వెళ్తున్న ఫ్రెండ్స్‌ను చూస్తూ వారికి నీ వార్తను చాటించే కృపనిమ్మని దేవుని వేడుకుంది స్పందన ●

ఆయన చేతులకు మనలను అప్పగించుకుంటే
పనికిరాని తీగలను నరికి, మనం మరెక్కువగా
ఫలించేలా చేస్తాడు.


దేవా! నీలో నిలచి ఫలించేలా సహాయం చెయ్యి...
"ఈ భూమి ఏలా వ్యర్థమైపోవలెను" అనే పరిస్థితి నుండి
నన్ను తప్పించి ఫలించే భాగ్యానివ్వు... అని ప్రార్థించింది
మౌనంగా.

అల్ల కల్లోలాలు చుట్టూ ఉన్నా
నిత్య ప్రశాంతత నిమ్మళంగా నివసిస్తుంది

దేవుని ప్రేమను రు చూచిన హృదయం
ఫలాలు ఫలించే పవిత్ర ఆలయం
చుట్టూ గోల చేసే బ్రతుకు బాధలన్నీ
ఆయన పాదపీఠం ముందు నోరుమూస్తాయి

పెనుగాలి ఎంత వీచినా
అలలు పైపైకి ఎగిసి, భయపెట్టినా
నాలో నివసించే ఆత్మ దేవుడు
అనువుగా నడిపిస్తాడు అన్ని వేళలా...

శ్యామలా కృపారావు, టీచర్ మరియు సన్ సిటీలో గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు



# స్టడీ సెంటర్




క్రీస్తునందు ప్రియమైన యు.ఇ.యస్.ఐ – టి.యస్ సభ్యులకు, ప్రభువు నామంలో ప్రాపర్టీ డిపార్ట్మెంట్ కమిటీ మెంబర్స్ తరపున మీ అందరికీ వందనములు.

స్టడీ సెంటర్ నిర్మాణం కోసం ప్రార్థించి, ఆర్థిక సహాయం చేసిన మీ అందరికీ వందనములు. ప్రస్తుతం రెండవ దశలో జరుగుతున్న పనిని ఏప్రిల్ నెల చివరికల్లా పూర్తిచేయాలని కమిటీ నిర్ణయించింది. ఇప్పటివరకు గోడలు కట్టి ప్లాస్టరింగ్ చేశారు. ఇంకా ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కలరింగ్ పనులు చేసి తలుపులు, కిటికీలు అమర్చాలి.

ప్రభువు కృప బట్టి, ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు రూ. 3,06,644 చెల్లించాం. స్టేట్ ఆఫీస్ రూమ్స్‌ను మార్చి 10 లోగా సిద్ధపరచుటకు ప్రార్థించండి. రెండవ దశ పని అంతటినీ పూర్తి చేయుటకు ఇంకా రూ. 25 లక్షలు అవసరం. కావున ప్రార్థించి మీ వంతు సహాయం చేయగలరు.

## Cost Analysis

| | |
|---|---|
| 1) Building works cost | |
| Ground floor internal works cost estimation | |
| Flooring | : Rs 10,00,000/- |
| Electrical | : Rs 3,00,000/- |
| Painting | : Rs 3,00,000/- |
| Plumbing | : Rs 2,00,000/- |
| Doors & Windows | : Rs 3,00,000/- |
| Furniture Cost (Approx.) | : Rs 4,00,000/- |
| **Total Internal works cost** | **: Rs 25,00,000/-** |
| 2) Watchmen Room Cost | : Rs 2,00,000/- |
| 3) Proposed to buy a kitechen equipment | : Rs 2,50,000/- |
| 4) Laying of internal roads and street lights | : Rs 2,50,000/- |
| 5) Providing children's park and equipment | : Rs 1,00,000/- |
| 6) To construct L-Shape steps in front of building | : Rs 1,50,000/- |
| **Grand Total Cost (1-6)** | **: Rs 34,50,000/-** |

**– కె.మధు కిరణ్**
ప్రాపర్టీ సెక్రటరీ,యు.ఇ.యస్.ఐ–టి.యస్



ప్రత్యేకం

# పరిణితి చెందిన వ్యక్తిలో ఉండాల్సిన లక్షణాలు

- రాజేష్ దాసరి

ఒక విశ్వాసి ఆత్మీయ పరిణితి అతనిలోని ఆత్మవరాలను బట్టి కాక ఆత్మఫలాలను బట్టి తెలుస్తుందని డాక్ట్రిన్స్‌లో మనం చేర్చుకుంటాం. ఆత్మ ఫలముల గూర్చి క్రిస్టాఫర్ రైట్ గారు రాసిన పుస్తకానికి "యేసు ప్రభువులా అవ్వడం" అని టైటిల్ పెట్టారు. అంటే ఆత్మఫలం మనలో ఉండేలా శ్రద్ధ తీసుకోవడం అంటే "యేసు ప్రభువులాగా మారడం" అనే అర్థం వస్తుంది. ఆ పుస్తకంలోని కొన్ని ప్రస్తావనలు, నేను నేర్చుకొన్న క్రొత్త విషయాలు మీతో పంచుకోవాలని ఆశిస్తున్నాను.

"ఆత్మ దేవా! ఈ రోజు మీ ఆత్మతో నన్ను నింపండి. నాలో మీ ఆత్మ ఫలమైన ప్రేమ, సంతోషం, సమాధానం, ధీర్ఘశాంతం, దయాళుత్వం, మంచితనం, విశ్వాసం, సాత్వికం, ఆశానిగ్రహం కలిగి ఫలించుటకు సహాయం చేయండని" జాన్ స్టాట్ గారు ప్రతి ఉదయం ఈ ప్రార్థనను చేసేవారు. నిజంగానే ఆయనను దగ్గరగా గమనించినవారు "క్రీస్తు ప్రభువును పోలిన నాయకుడని" సాక్ష్యమిచ్చారు.

**ఆత్మ ఫలంలోని ఒక్కొ విషయాన్ని గూర్చి క్లుప్తంగా చూద్దాం**

**ప్రేమ:** ప్రేమ లేనివాడు జీవం లేనివాడని వాక్యంలో వ్రాయబడింది. "ప్రేమ లేని వాడు మరణమందు నిలిచియున్నాడు" (1 యోహాను 3:14).

ఎఫెసు సంఘానికి అన్ని గుణాలు ఉన్నా, "అయినను మొదట నీకుండిన ప్రేమను నీవు వదిలితివని నేను నీ మీద తప్పు ఒకటి మోపవలసియున్నది. నీవు ఏ స్థితిలోనుండి పడితివో అది జ్ఞాపకము చేసికొని మారుమనస్సుపొంది ఆ మొదటి క్రియలను చేయుము. అట్లు చేసి నీవు మారుమనస్సు పొందితేనే సరి; లేనియెడల నేను నీయొద్దకు వచ్చి నీ దీపస్తంభమును దాని చోటనుండి తీసివేతును" అని ప్రభువు హెచ్చరించాడు (ప్రకటన 4:4-5).

ప్రకటన గ్రంథంలో 'దీపస్తంభం' అంటే సంఘానికి గుర్తుగా ఉంది (1:20). "ప్రేమ లేకపోతే ఎఫెసు సంఘాన్ని తీసివేస్తాను" అని ప్రభువన్న మాటలలో ఎంత తీవ్రత ఉందో మనకు అర్థమవుతుంది.

మన విద్యార్థులను, గ్రాడ్యుయేట్లను స్టాఫ్‌ను ప్రేమిద్దాం. ఆయన ప్రేమించే ప్రజలను ప్రేమిద్దాం. అందరికన్నా, అన్నింటికన్నా ఆయనను ప్రేమిద్దాం.

**సంతోషం:** మనం సంతోషంగా ఉండాలనేది దేవుని చిత్తం. అందుకే ఆయన "చింతించవద్దు" అని చెప్పారు. లేఖనాలను పరిశీలించినట్లయితే "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి. మీ సహనమును సకల జనులకు తెలియబడనియ్యుడి. ప్రభువు సమీపముగా ఉన్నాడు. దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" అని వ్రాయబడియున్నది (ఫిలిప్పీ 4:4-6).

ప్రభువు పైన భారం వేసి విశ్వాసంతో నిశ్చింతగా ఉండడం, సంతోషంగా ఉండడం మన జీవితాల్లో ఆత్మీయ ఫలాన్ని చూపిస్తుంది.

**సమాధానం:** "శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి"(రోమా 12:18). సాధ్యమైనంత వరకు సమాధానం కోసం మనం ప్రయత్నించాలి, ప్రార్థించాలి. సమాధానం మన త్రియేక దేవునిలో ఉంది. ఆయనతో అనుబంధం కలిగి ఉంటే, సమాధానం అనుదిన జీవితంలో, సంబంధ బాంధవ్యాలలో ప్రతిబింబించాలి.

**ధీర్ఘశాంతం:** ఏలాంటి సవాళ్ళు ఎదురైనా, విమర్శల బాణాలు గుచ్చుకున్నా ధైర్యంగా సంశయాన్ని పాటిస్తూ మానసిక ధైర్యం కలిగి ముందుకు సాగిపోవడమే దీర్ఘశాంతం.

క్రీస్తు ప్రభు జీవితంలో ఎన్ని విమర్శలు ఎదురైనా, కఠిన

తీర్పుకు గురైనా ఆయన దీర్ఘశాంతాన్ని వదలలేదు. ఆయనే మనకు మాదిరి. "ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమ పెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను" (1 పేతురు 1:21). ఆయనకు సమీపంగా జీవిస్తూ ఆయన స్వభావంలో ఎదుగుదాం. ఆయన అడుగు జాడలలో నడుద్దాం.

**దయాళుత్వం:** మనం ఇతరుల క్షేమాన్ని కోరి మేలు చేయడమే దయాళుత్వం. దేవుడు దయగలవాడు. ఆ దయా స్వభావాన్ని మనం కలిగియుండాలి.

యేసయ్య దగ్గరకు వచ్చిన కుష్టువ్యాధిగ్రస్తుడిని "ఆయన చెయ్యి చాపి వానిని ముట్టి నా కిష్టమే; నీవు శుద్ధుడవు కమ్మని వానితో చెప్పెను" (మార్కు 1:40-42). మన సహవాసంలో ఒకరిపట్ల ఒకరం దయచూపించి క్రీస్తు ప్రభుని ఆదర్శం కలిగియుందుము గాక!

**మంచితనం:** గ్రీకు భాషలో 'మంచితనం' అనేది నైతిక విలువలు కలిగిన వ్యక్తిని గూర్చి ప్రస్తావించినప్పుడు మంచితనంగా పిలుస్తాం. ధారాళంగా, దాతృత్వం కలిగిన వ్యక్తి కూడా మంచితనం అని చెప్పబడింది.

మన మంచితనానికి ఆధారం ప్రభువే. మనలో నైతిక విలువలతో పాటు దాతృత్వం కలిగి దేవుని లక్షణాలను మన వ్యక్తిగత జీవితంలోనూ, సహవాసములోనూ ప్రతిఫలించినప్పుడు దేవునికి మహిమ కలుగుతుంది.

**విశ్వాసం:** ఇక్కడ చెప్పబడిన విశ్వాసం అంటే 'విశ్వాస్యత' అని గుర్తించాలి. దేవుడు నమ్మదగినవాడు. ఎంతో విశ్వాస్యత ఆయనలో ఉన్నది. ఆయన పిల్లలంగా మనలో కూడా విశ్వాస్యత ప్రతిఫలించాలి.

**సాత్వికం:** ప్రభువైన క్రీస్తు జీవితంలో సాత్వికం, దీనమనస్సు ఉన్నవి (మత్తయి 11:28). ఆయన దగ్గర నేర్చుకోవడానికి నిజమైన శిష్యులంగా పిలువబడ్డాం.

**ఆశానిగ్రహం:** ఈ లక్షణం విభిన్నమైనది. ఆశానిగ్రహం లేనివాడు 'ప్రాకరం లేక పాడైన పురం' వంటి వాడని లేఖనాల్లో చూడవచ్చు (సామె 25:28). క్రొత్త బైక్‌కు బ్రేక్స్ లేకుండా ఇస్తే నాశనం అయినట్లే మనిషి జీవితం కూడా నాశమవుతుంది. అశ్లీలత, అసభ్యత నిండిన మీడియా ప్రపంచంలో మనం "ఆశానిగ్రహం" అనే ఫలం ఫలించాలని దేవుడు కోరుచున్నారు.

మరి మనం ఆత్మ ఫలాన్ని ఫలించాలని తీర్మానం చేసుకుందాం. దేవుడు మనందరం ఆత్మ ఫలం ఫలించునట్లుగా ఆశీర్వదించుచుండగా ఆయనకు ఇష్టమైన రీతిలో జీవించడానికి పునరంకితమవుదాం. అట్టి కృపను పరిశుద్ధాత్మ దేవుడు మనకనుగ్రహించును గాక! ●

**రాజేష్ దాసరి, స్టేట్ సెక్రెటరీ (డిసిగ్నేట్), యు.ఇ.యస్.ఐ-టియస్, హైదరాబాద్**

✦✦✦✦✦✦✦✦

## NEWS ALERTS

### ✦ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా తమిళిసైకు అదనపు బాధ్యతలు

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవి నుంచి కిరణ్ బేడిని కేంద్ర ప్రభుత్వం తొలగించి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

### ✦ అర్జున్ యుద్ధ ట్యాంకు 'మార్క్ 1ఏ'ను సైన్యానికి అప్పగించిన ప్రధాని

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తమిళనాడులో రూపొందించిన 'అర్జున్ యుద్ధ ట్యాంకు మార్క్-1ఏ'ను ప్రధాని మోదీ సైన్యానికి అప్పగించారు. తేజస్ తర్వాత ఆత్మనిర్భర్ భారత్ కింద భారత దళాలకు అందిన అతిపెద్ద ఆయుధం అర్జున్ యుద్ధ ట్యాంకు. ట్యాంకు నమూనాను సైన్యాధిపతి ఎంఎం నరవణేకు అందజేశారు.

### ✦ సుచిత్ర ఎల్లా, పుల్లెల గోపీచంద్‌లకు బిజినెస్ ఎక్సలెన్స్ పురస్కారాలు

ఫార్మా రంగంలో హైదరాబాద్‌లోని భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా, క్రీడా రంగానికి అందించిన సేవలకుగాను పుల్లెల గోపీచంద్ ఈ అవార్డులను అందుకున్నారు.

# TREASURER'S REPORT

# కోశాధికారి కలం నుండి.....

**"గోధుమగింజ భూమిలో పడి చావకుండినయెడల అది ఒంటిగానే యుండును; అది చచ్చినయెడల విస్తారముగా ఫలించును" (యోహాను 12:24).**

ప్రియమైన **యు.ఇ.యస్.ఐ - టి.యస్** సభ్యులకు, ప్రభుక్రీస్తు నామంలో శుభములు.

గత 11 నెలలు గమనిస్తే ఎవ్వరమూ ఊహించని సంఘటనలు జరిగినవి. మన ప్రియులు అనేకమంది ఈ లోకయాత్రను ముగించుకొని, మరో మాటలో చెప్పాలంటే దేవుడు వారికి ఇచ్చిన పనిని ముగించుకొని ఆయన సన్నిధికి చేరారు. కె.యెహెజ్కేలు అన్న, తాళ్లూరి ప్రసాద్ అన్న, యన్.కమల కుమారి అక్క లాంటి ప్రభావశీలురైన యు.ఇ.యస్.ఐ నాయకులను కోల్పోయాం. వీరు మన పరిచర్యలోనే కాకుండా వారు పని చేసిన ప్రదేశాలలో కూడా ప్రభువు కొరకు మంచి సాక్షులుగా జీవించారు, ప్రభువును వారి నడవడిక ద్వారా చూపించారు అనడంలో అతిశయోక్తి లేదు.

ముఖ్యంగా అప్పటి గ్రేటర్ హైదరాబాద్ స్టడీ సెంటర్ (GHSC) నిర్మాణంలో అంటే, ప్రస్తుత టి.యస్ స్టడీ సెంటర్ కోసం యెహెజ్కేలు అన్న తీసుకున్న చొరవ మరువలేనిది. వారి సమయాన్ని, నిపుణతను, ధనమును కుటుంబ సమేతంగా ధారాళంగా ప్రభు పనికి వెచ్చించారు. నిర్మాణం చేపట్టిన తొలి దినాలలో స్థానికులతో సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబమంతా అక్కడే నివసించేవారు. వారు తీసుకున్న రిస్క్, చేసిన ప్రార్థన ఎప్పటికీ మరువలేనిది. మనందరికీ అదొక సవాలు విసురుతూనే ఉంది.

కమల కుమారి అక్క కూడా మహేశ్వరం రిట్రీట్ సెంటర్‌ను ఎంతో ధారాళంగా ప్రభు పనికి ఇచ్చింది. స్థలం మాత్రమే కాకుండా తన రిటైర్మెంట్ కోసం దాచుకున్న ధనమంతటిని వెచ్చించి, అందులో నిర్మాణమును కూడా తానే దగ్గరుండి చేయించి యు.ఇ.యస్.ఐకు బహుమానంగా ఇచ్చింది. ప్రభువును, ఆయన పనిని అక్క ప్రేమించిన విధానం, అనేకమంది విద్యార్థులను ప్రభావితం చేసిన విషయాలు ఎప్పటికీ మనకు సవాలు విసురుతూనే ఉంటాయి.

"యెహోవా భక్తుల మరణము ఆయన దృష్టికి విలువ గలది" అని కీర్తన 116:15లో చెప్పబడినట్లుగా, ఇప్పుడు వీరంతా ప్రభు సన్నిధిలో ఉండగా, ఏదో ఒకరోజు మనమందరం కలిసి ఆయనను ఆరాధించబోతున్నాం అనే గొప్ప నిరీక్షణతో, వీరి వలే మనం కూడా ప్రస్తుతం మనకివ్వబడిన సమయమును, నిపుణతను, ధనమును ప్రభు పనికై వెచ్చిద్దాం మరియు అనేకమందిని ఆయన కొరకు గెలుచుకుందాం.

## స్తుతించండి

1. స్టాఫ్‌కు సకాలంలో 100% జీతములు ఇవ్వగలిగిన దాన్ని బట్టి
2. స్టడీ సెంటర్ నిర్మాణపు పనులు వేగంగా జరుగుతున్న దాన్ని బట్టి
3. మనకు కావలిసిన 100 కె.వి ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్ పనులు జరుగుతున్న దాన్ని బట్టి

## ప్రార్థించండి

1. ప్రతి నెల బడ్జెట్ రూ. 7.7 లక్షల కొరకు
2. కళాశాల తరగతులు భౌతికంగా మొదలయ్యాయి కాబట్టి, విద్యార్థుల మధ్య పరిచర్య కూడా భౌతికంగా మొదలగులాగున
3. స్టేట్ ఆఫీస్‌ను మన స్టడీ సెంటర్ ప్రాంగణంలోనికి మార్చడానికి ఏర్పాటు చేయవలసిన వసతుల గురించి
4. స్టడీ సెంటర్ నిర్మాణపు పనులు పూర్తి చేయడానికి

**ప్రశ్న:** సంవత్సరంలో ఒక్కసారైనా లోకల్ అకౌంట్‌ను క్లియర్ చేయడం ఏ నెలలో చేస్తే బాగుంటుంది?

**జవాబు:** కోవిడ్-19 వచ్చినప్పటినుండి లోకల్ ప్రోగ్రామ్స్ భౌతికంగా జరగడం లేదు కాబట్టి, రానున్న రెండు మాసములలో లోకల్ అకౌంట్‌ను క్లియర్ చేసి స్టేట్ ఆఫీస్‌కు పంపిస్తే, ప్రస్తుతం జరుగుతున్న స్టడీ సెంటర్ నిర్మాణముకు అవి ఎంతగానో ఉపయోగపడతాయి. మే 2021 మాసం నుండి విద్యార్థులకు చాలా ప్రోగ్రామ్స్ భౌతికంగా అక్కడే జరగబోతున్నాయి కాబట్టి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
డి.అనీల్ కుమార్

| UESI - TS MONTHLY REQUIREMENT - Rs. 7.7 Lacs. | | | |
|---|---|---|---|
| Jan-21 | | | |
| RECEIPTS | Rs. | PAYMENTS | Rs. |
| General Contribution | 5,38,408.00 | Field Staff Salaries | 4,09,572.44 |
| Staff Support | 65,700.00 | Office Staff Salaries | 86,869.31 |
| | | Gratuity Fund | 13,429.60 |
| | | Missionary Upholders Trust | 4,900.00 |
| | | Office Rent | 13,000.00 |
| | | Repairs & Maintenance | 16,140.34 |
| | | UESI | 25,000.00 |
| | | NEGF | 3,000.00 |
| | | Bihar State Support | 16,000.00 |
| | | SWF | 16,196.31 |
| **Total** | **6,04,108.00** | **Total** | **6,04,108.00** |

| | | | |
|---|---|---|---|
| UESI (Support from EGF's) | 1,94,200.00 | UESI | 1,94,200.00 |

# ఫిబ్రవరి‘21 పజిల్
## యెహోషువ (7-12 అధ్యాయాలు)

అడ్డం:

1. యాజీను ఏ దేశపు రాజు?
2. యెహోవా మోషేతో చెప్పినట్లు ఎవరు దేశమంతటిని పట్టుకొనెను?
4. ఎవరిని ఉండకుండ నిర్మూలం చేస్తే ఇశ్రాయేలీయులకు దేవుడు తోడైయుండును?
6. లాకీషుకు సహాయం చేయుటకు వచ్చిన గెజెరు రాజు పేరు?
7. ఆకోరు లోయ అనగా అర్థమేమిటి?
8. యొర్దానుకు తూర్పుగా అవతలనున్న లోయ పేరు?
11. జనులు తమ శత్రువుల మీద పగతీర్చుకొను వరకు సూర్యుడు నిలిచెను, చంద్రుడు ఆగెనను మాట ఏ గ్రంథంలో వ్రాయబడి యున్నది?
12. సూర్యుడు ఆకాశ మధ్యమున నిలిచి ఉన్న రోజు యెహోవా ఇశ్రయేలీయుల పక్షమున ఏమి చేసెను? (కుడి వైపు నుండి)
13. యూదా గోత్రంలో జెరహు మునిమనుమడు ఎవరు? (కుడి వైపు నుండి)
14. పరాక్రమము గల ఎంతమంది శూరులను యెహోషువ ఏర్పరచి రాత్రివేళ పోయి మీదికి పంపెను? (కుడి వైపు నుండి)

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | | | | | 2 | | | 3 |
| | | | | | | | | | | |
| | 4 | | | | | | | | | |
| | | | | | | | | | | |
| | | 5 | | | | | | | | |
| | | 6 | | | | 7 | | | | |
| 8 | | | | | 9 | | | | | 10 |
| | | | | | | | | 11 | | |
| | | | 12 | | | | | | | |
| 13 | | | | | 14 | | | | | |

నిలువు:

1. శపితమైన దానిని ఆశించడం వల్ల ఇశ్రాయేలీయులు ఏ దేశం వారి యెదుట నిలువలేకపోయారు?
2. దేనిని మీరితే ఇశ్రాయేలీయులలో దుష్కార్యం చేసిన వానిని అగ్నిచేత కాల్చివేస్తారు?
3. ఇశ్రాయేలీయులు కత్తివాత చంపిన వారికంటే దేనిచేత చచ్చినవారు ఎక్కువమంది ఉన్నారు?
5. యొర్దాను అద్దరినున్న హెష్బోను రాజు ఎవరు?
8. యెహోషువ తన ప్రార్థనలో చంద్రుణ్ణి ఏ లోయలో నిలువమని చెప్పెను?
9. గిబియోను నివాసులు ఎవరు?
10. పడమటనున్న ఏ మన్యపు రాజునకు యాజీను వర్తమానం పంపెను?

– డి. రాము,
లెక్చరర్, టి.ఎస్ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్
మరియు కరీంనగర్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్

* * * * * * * * * * * * * *

# జనవరి‘21 పజిల్ జవాబులు
## యెహోషువ (1- 6 అధ్యాయాలు)

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 సు | హో | సీ | | 2 ని | | | | 3 షి | | | |
| సూ | | | | బం | | | | త్తీ | | | |
| | 4 యె | హో | వా | ధ | నా | గా | ర | ము | | | 5 గి |
| | హో | | | న | | | | | | | ల్గా |
| | వా | | | మం | | 6 ఇ | శ్రా | యే | లీ | యు | లు |
| | సే | | | ద | | | | | | | |
| 7 క | నా | ను | | స | | | | | | 8 ఏ | |
| | ధి | | | 9 ము | ద్ర | 10 శా | స్త్ర | ధ | | క్ర | |
| | 11 ప | స్కా | | | | ప | | | | ని | |
| 12 రా | తి | | | 13 యొ | | గ్ర | | | 14 ఆ | దా | ము |
| | | | | ర్దా | | స్తు | | | | ర | |
| 15 ఎ | డ | బా | య | ను | | డు | | 16 దై | ర్య | ము | |

విజేతలు
1. పి.రాణి జగదీష్, మిర్యాలగూడ
2. యం.ప్రియాంక, కొండమల్లెపల్లి

Edited Printed and Published by Mr. Sudhir Kumar Gaddam for UESI-TS Publication Trust, Flat No.107, Archana Enclave, Near Mahindra Hills Cross Road, East Marredpally, Secunderabad-500026 and Printed at Marvellous Printers, Nallakunta, Hyderabad.